




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 34 | ది. 5-5-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 34 | Date : 5-5-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


## మూడు రాష్ట్రాలలో

# ఎన్డీయే ప్రభంజనం

- కేరళ లో ఊరట పొందిన కాంగ్రెస్
- తమిళనాడు లో దళపతి విజయ్ జైత్రయాత్ర

**న్యూఢిల్లీ, మే 4 (వార్తాప్రభ) :** పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయాల్లో అనూహ్య మార్పులకు సంకేతంగా నిలిచాయి. ఈ ఫలితాల్లో బీజేపీ తన బలాన్ని నిరూపించుకోగా, కాంగ్రెస్ ఒక రాష్ట్రాన్ని దక్కించుకుంది. అయితే, అందరి దృష్టిని ఆకర్షించిన తమిళనాడు మాత్రం హంగ్ దిశగా సాగి, ఒక కొత్త రాజకీయ శకానికి తెరతీసింది.




**బీజేపీ హ్యాట్రిక్ - బెంగాల్‌లో చారిత్రక విజయం..** ఈ ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి జైత్రయాత్ర సాగించింది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ 15 ఏళ్ల పాలనకు చరమగీతం పాడుతూ బీజేపీ దాదాపు 200 స్థానాల దిశగా దూసుకుపోవడం ఒక చారిత్రక ఘట్టం. అలాగే, అస్సాం లో హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలో బీజేపీ వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకుని హ్యాట్రిక్ కొట్టింది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి లో కూడా ఎన్ఆర్ కాంగ్రెస్-బీజేపీ కూటమి మళ్ళీ అధికారాన్ని చేజిక్కించుకుంది.

**కేరళలో కాంగ్రెస్ పునరాగమనం..** దశాబ్ద కాలంగా కమ్యూనిస్టుల కోటగా ఉన్న కేరళ లో ఈసారి మార్పు పవనాలు వీచాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ స్పష్టమైన మెజారిటీ సాధించి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని గద్దె దించింది. పదేళ్ల ఎల్‌డీఎఫ్ పాలనపై ఉన్న వ్యతిరేకత కాంగ్రెస్‌కు వరంగా మారింది. దీంతో ఐదు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఒక రాష్ట్రాన్ని తన ఖాతాలో వేసుకుని ఊపిరి పీల్చుకుంది.

**తమిళనాడులో విజయ్ ప్రభంజనం - హంగ్ అసెంబ్లీ..** అత్యంత ఆసక్తికరంగా మారిన తమిళనాడు ఫలితాల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. విజయ్ సుమారు 106-109 స్థానాల్లో ముందంజలో ఉండి మ్యాజిక్ ఫిగర్ కు చేరువలో నిలిచారు. అధికార డీఎంకే రెండో స్థానంతో సరి పెట్టుకుంది. ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో ఇక్కడ హంగ్ ఏర్పడింది. ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు మిత్రపక్షాల మద్దతు లేదా ఇతర సమీకరణాలు అనివార్యమయ్యాయి. పాత తరం రాజకీయాలకు కాలం చెల్లి, ప్రజలు సరికొత్త ముఖాలను, అభివృద్ధిని కోరుకుంటున్నారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార మార్పిడి జరిగిన రాష్ట్రాల్లో ఇప్పుడు కొత్త ప్రభుత్వాల ఏర్పాటుపై కసరత్తు మొదలైంది.

## ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి: ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ , మే 4 (వార్తాప్రభ) :** పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించిందని.. బంగాల్‌లోని ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ప్రధాని మోడీ అన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి భారీ విజయం సాధించిన నేపథ్యంలో మోడీ న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళ ప్రాంతాల్లో బిజెపి బలమైన ఎన్నికల ప్రదర్శన కనబరిచినందని.. ఆ రాష్ట్రాల ప్రజలకు తాను గౌరవపూర్వకంగా నమస్కరిస్తున్నానని అన్నారు. "లక్షలాది మంది బీజేపీ కార్యకర్తలకు కూడా నేను హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నానని చెప్పారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి బీజేపీ కార్యకర్త మరోసారి అద్భుతాలు సృష్టించారని.. వారు కమలాన్ని వికసింపజేశారని అన్నారు. బిజెపి కి బెంగాల్ ప్రజలు మద్దతుగా నిలిచారని.. పార్టీని గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ప్రధాని అన్నారు. బెంగాల్ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నానని ప్రధాని తెలిపారు. కాగా, బెంగాల్ లో మొత్తం 294 స్థానాల్లో బిజెపి 206 స్థానాల్లో ముందంజలో ఉంది.

# నీటి సరఫరాకు జిల్లాకు రూ.1 కోటి

- సులభతరంగా వాహన రిజిస్ట్రేషన్లు
- అదనపు వాహన రిజిస్ట్రేషన్ అథారిటీగా వాహన డీలర్లు
- ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై సలహా మండలి
- వివిధ శాఖలపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి,మే 4 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సరఫరా సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నీటి సరఫరా కోసం జిల్లా కలెక్టర్లకు రూ.1 కోటి చొప్పున నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. కొరత ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. బోర్లు కూడా మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేలా వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించేందుకు సీఎం ఆమోదాన్ని తెలియచేశారు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తి అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందించే పౌర సేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత పెంచేందుకు, సమర్ధంగా వినియోగించేందుకు వీలుగా నిపుణులతో కూడిన సలహా మండలి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించాలని సీఎం సూచనలు చేశారు. మైనింగ్ కార్యకలాపాలను సమర్ధంగా నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసి ఏపీలోనూ అమలు చేసేలా చూడాలన్నారు. అవేర్ సాంకేతికతను వినియోగించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న ప్రాంతాల్లో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలకు ఉపశమనం కలిగేలా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌ను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అత్యవసర సేవలు మినహా అన్నీ ఆన్ లైన్లోనే..** ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలు మెరుగ్గా అందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవల్లో మెరుగైన ప్రజాభిప్రాయం కోసం పబ్లిక్ కనెక్ట్ అనేది కీలకమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసాన్ని, క్రెడిబిలిటీని పెంచేలా ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రతీ ప్రభుత్వ శాఖ నిర్దేశిత ప్రమాణాలకు తగినట్టుగా పనిచేయాల్సిందేనని ముఖ్యమంత్రి సూచించారు. పంటలకు ధర విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మార్కెట్ ను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్టీజీఎస్ అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేలా సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో 3 రోజుల పాటు, హెచ్ ఓడీలు 6 రోజుల పాటు, జిల్లా కలెక్టర్లు 8 రోజుల పాటు 7 క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని నిర్దేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం కాల్ సెంటర్ ద్వారా వివరాలను సేకరించాలని సీఎం సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉత్తమ విధానాలు అనుసరించాలన్నారు. అధికారులు ఏ అంశంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారో అక్కడ మంచి ఫలితాలు వస్తున్నాయని.. మిగిలిన చోట్ల కూడా ఇదే చొరవ చూపాలన్నారు. అత్యవసర సేవలు మినహా ప్రభుత్వ శాఖలు అందించే మిగతా అన్ని సేవల్ని ఆన్ లైన్ లో అందించాలని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధం ముగిసిన తర్వాత అవేర్ ద్వారా వచ్చే డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా లభించే ప్రాంతాలను మత్స్యకారులకు అందజేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఈ సమీక్షకు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ జి. సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ప్రజా తీర్పు మార్పు, అభివృద్ధి కోసమేనన్న పవన్ కల్యాణ్

- పశ్చిమ బెంగాల్‌లో చారిత్రక విజయం సాధించిన బీజేపీకి అభినందనలు



**అమరావతి,మే 4 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై స్పందించారు. ఈ ఫలితాలు మార్పు, అభివృద్ధి పట్ల ప్రజల ఆకాంక్షను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో అభివృద్ధికి పట్టం కట్టగా, మరికొన్ని చోట్ల ప్రజలు నిర్ణయాత్మక మార్పును కోరుకున్నారని విశ్లేషించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. "నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో వెలువడిన ఎన్నికల ఫలితాలు.. అభివృద్ధి, స్పష్టమైన మార్పుల కోసం ప్రజలు ఎంతగా ఎదురుచూస్తున్నారో స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రజాతీర్పును నేను మనస్ఫూర్తిగా గౌరవిస్తున్నాను. అస్సాం, పుదుచ్చేరి ప్రజలు అభివృద్ధికి పెద్దపీట వేసే నాయకత్వాన్ని మరోసారి ఆశీర్వదించగా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ఓటర్లు రాజకీయ మార్పును కోరుకున్నారు. ముఖ్యంగా, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది.

## కేరళలో కాంగ్రెస్ గెలుపు వెనుక రేవంత్ రెడ్డి పాత్ర



**హైదరాబాద్,మే 4 (వార్తాప్రభ) :** కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాలు ఉన్నాయని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ప్రభుత్వం ఏర్పాటుకు 71 సీట్లు అవసరం కాగా, యూడీఎఫ్ కూటమి 100కి పైగా స్థానాల్లో గెలుపొందింది. మరోవైపు, అధికార ఎల్డీఎఫ్ కూటమి ఇప్పటిదాకా 33 స్థానాల్లో గెలుపొందింది. కేరళ ఫలితాలపై అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, యూడీఎఫ్ విజయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్‌పై రేవంత్ రెడ్డి నేరుగా విమర్శలు చేశారని గుర్తు చేశారు. కేరళ అభివృద్ధిపై విజయన్‌ను నిలదీయడంతో పాటు లేఖలు కూడా రాశారని గుర్తు చేశారు. అదే సమయంలో తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేరళ ప్రచారంలో ముఖ్యమంత్రి వివరించారని గుర్తు చేశారు.

# గ్లోబల్ బ్రాండ్లుగా స్థానిక ఉత్పత్తులు

- పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ
- రవాణా వ్యయం తగ్గించటమే కీలకమైన అంశం
- ఇండస్ట్రీ- ఇన్ఫ్రా- టూరిజం అంశాలపై ప్రత్యేక దృష్టి
- ఏపీలో ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష



**అమరావతి,మే 4 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ప్రొడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా విశాఖ ఎకనామిక్ రీజియన్, అమరావతి ఎకనామిక్ రీజియన్, తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం( భవ్య పథకం) కింద చేపట్టనున్న పారిశ్రామిక పార్కులు, కెమికల్ పార్కుల అభివృద్ధి పై సీఎం చర్చించారు. 2026-27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై సమీక్షలో చర్చించారు. పారిశ్రామిక పార్కుల్లో ప్రొడెక్టు పర్ఫెక్షన్ తో పాటు లాజిస్టిక్స్ ను కూడా అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ లాంటి మౌలిక సదుపాయాలు ఈ లాజిస్టిక్స్ పార్కులకు అనుసంధానమయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకించి రవాణా వ్యయం తగ్గితే ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక క్లస్టర్లకు రైల్, రోడ్, పోర్టు కనెక్టివిటీ జరిగేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచనలు చేశారు.

**ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధి...** స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు నాణ్యత పెరిగితేనే గ్లోబల్ స్థాయికి చేరుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉత్పత్తులకు స్థానికంగా, ప్రాంతీయంగా, దేశ, విదేశీ మార్కెట్లకు చేరేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంఎస్ఎంఈల్లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారయ్యేలా ప్రోత్సాహం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయటం ద్వారా రైతులకూ ప్రయోజనం కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన భవ్య పథకం ద్వారా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో రసాయనాల తయారీ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలు- మౌలిక సదుపాయాలు- పర్యాటకం అనే విధానంలో ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రతీ జిల్లాలోనూ ఓ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కలుగుతాయన్నారు. ప్రతీ పారిశ్రామిక క్లస్టర్ వద్దా ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈల స్థాపనలో అగ్రస్థానంలో ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ జరగాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం యూనివర్సిటీ ల్లోనూ కోర్సులను హైబ్రీడ్ విధానంలో అందించే ఆలోచన చేయాలన్నారు. సమీక్షకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.


## CHANGE OF NAME

I, **K.ROOTHU (Old Name), W/o. (late) K.Ratna Raj**, R/o. # 20-4-60/A, Basavataraka Nagar, Ayodhya Nagar, Vijayawada, NTR District-520003, A.P. India. I have changed my name as **KARRY RUTHAMMA (New Name), W/o. (late) Karee Ratna Raju**. Hereafter my name is known as **KARRY RUTHAMMA (New Name), W/o. (late) Karee Ratna Raju.**

## డాక్యుమెంట్స్ పోయినవి

NTR జిల్లా, జి.కొండూరు (మం), జి.కొండూరు గ్రామ కాపురస్తులయిన నీలపాల వెంకటేశ్వరరావు S/o వీరాస్వామి అను నాకు జి.కొండూరు (మం), జి.కొండూరు గ్రామంలో భూమి కలదు. ఈ భూమికి సంబంధించిన 3792/3636 నెంబరు గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ దస్తావేజులు ది.15-04-2026న బైక్ మీద జిరాక్స్ కోసం జి.కొండూరు సెంటర్‌కు వెళ్ళుతుండగా మార్గమధ్యలో పోయినవి దొరికినవారు క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

**సెల్ : 97034 09045**

## వేలం ప్రకటన

పెదన మండలం దావోజిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (PACS) సంఘ భవనము ది.5-5-2026 సాయంత్రం 3 గంటలకు వేలం వేయుటకు సంఘ CEO గారు త్రిసభ్య కమిటీ సభ్యుల సమక్షంలో పేపరు ప్రకటన ఇవ్వటం జరిగినది. పాల్గొనేవారు ధరావత్తుగా రూ॥ 10,000/- కట్టి వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరటం అయినది.

**స్థలం : పెదన మండలం దావోజిపాలెం సంఘ ఆవరణలో**
**PIC : 9396897833, CEO : 9701571143**
**ఇట్లు : CEO, దావోజిపాలెం PACS**

## సూపర్ సిక్స్ పై శ్వేత పత్రం విడుదల చేయాలి

● తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్



**విస్సన్నపేట,మే 4 (వార్తాప్రభ) :** స్థానిక మండల వైసిపి కార్యాలయం లో నియోజకవర్గ ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాస్ సూపర్ సిక్స్ వైఫల్యాలపై మీడియా సమావేశం నిర్వహించారు. సూపర్ సెక్స్ పథకాల పట్ల 9వ తేదీన జరగనున్న మాధవరం బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్ని పింఛన్లు ఇచ్చింది చెప్పాల న్నారు. ఒకవైపు విద్యుత్ కోత మరోవైపు పెట్రోల్ కొరత వీటన్నిటిని మించి రైతన్నకు గుండె కోత మిగులుస్తున్నారని ధాన్యం ఆరబోత కల్లాలలో ఇప్పటికే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని గన్ని బ్యాగ్స్ లేక కొందరు కొంటారో కొనరో తెలియక మరికొందరు వర్షం పడితే మా పరిస్థితి ఏమిటి అని ఇంకొందరు గుండెలను గుప్పెట్లో పట్టుకొని కంటిపై కునుకు లేకుండా దేవునిపై భారం వేసి క్షణక్షణం భయం భయంగా ఉండేవారు ఎందరు ఎందరో ఉన్నారు ఉన్నారన్నారు. మొక్కజొన్న పరిస్థితి మరీ దయనీయంగా ఉన్నదని వారికైతే పలకరింపు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు ఓలేటి దుర్గారావు, జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, జిల్లా నాయకులు ప్రకాష్, లక్ష్మయ్య, రాజేష్, లాలయ్య రామవరపు శ్రీను, దుర్గ, నటరాజ్ ఆలీ సతీష్ షరీఫ్, బాజీ, సీతయ్య, సుధీర్ విక్రం, బాజీ బాబా వెంగళ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వారసులుగా వారి ఆశయాలు నెరవేర్చటానికి సిద్ధంగా ఉంటాం

-ఎన్టీఆర్ తనయుడు నందమూరి మోహన్ కృష్ణ





**మచిలీపట్నం,మే 4 (వార్తాప్రభ) :** ఎన్.టి. రామారావు వారసులుగా వారి ఆశయాలు నెరవేర్చటానికి కుటుంబ సభ్యులమైన మేము మా వంతు సేవలు సమాజానికి అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఎన్.టి.ఆర్. తనయుడు నందమూరి మోహన కృష్ణ వెల్లడించారు. నందమూరి తారక రామారావు, బసవ రామ తారకం ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఎన్టీఆర్ స్వగ్రామం పామర్రు మండలం, నిమ్మకూరు గ్రామానికి మోహన కృష్ణ, వారి కుమార్తె మోహన రూప విచ్చేసారు. తొలుత ఎన్టీఆర్ బసవ రామ తారకం విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు, అంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అర్చకులు సుదర్శనం లక్ష్మి నర్సింహాచార్యులు శేష వస్త్రాలు తో శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాద సేవ ట్రస్ట్ కార్యదర్శి నందమూరి జయ శంకర్ ప్రసాద్, కోశాధికారి పి. ఎం ఎస్. ప్రసాద్, ట్రస్టీ నందమూరి శివరామ కృష్ణ,గ్రామ శివాలయం ఇ ఓ జన్ను వేంకటేశ్వర రావు తదితర గ్రామ ప్రముఖులు మోహన్ కృష్ణ, మోహన్ రూప లను సన్మానించ్చారు. నందమూరి మోహన కృష్ణ కుటుంబ సభ్యుల వితరణ తో ఎన్టీఆర్ బసవ రామ తారకం ల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా మోహన్ కృష్ణ, మోహన్ రూప లు స్వయంగా భక్తులకు భోజనం వడ్డన చేసి, ఆనందపరిచారు. ఈ సందర్భంగా ఎన్.టి.ఆర్. అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నె సోమేశ్వరరావు రచించిన ఎన్.టి.ఆర్. సినీ ప్రస్థానం పుస్తకాన్ని మోహన కృష్ణ, మోహన రూప లకు అందచేశారు.

## పెనుమల్లి జడ్పీ హైస్కూల్లో సరస్వతి విగ్రహావిష్కరణ



**పెడన,మే 4 (వార్తాప్రభ) :** పెడన మండలం పెనుమల్లిలో సరస్వతి విగ్రహావిష్కరణ జరిగింది. గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2003-2004 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని జడ్పీటీసీ సభ్యులు అర్జా నగేష్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరచి పాఠశాలకి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సరస్వతి దేవి ఆశీస్సులతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు 2003-2004 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేమల్లె,పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



**హనుమాన్ జంక్షన్,మే 4 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతిలో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థులను పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ సుదిమెళ్ళ శ్యామ్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కలపాల రాధాకృష్ణ , రేమల్లే గ్రామ టిడిపి అధ్యక్షులు చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి ఈడే నారాయణ,మరియు గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బి శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరిని వేలెత్తి చూపే సమయంలో మన వైపు మూడు వేళ్ళు ఉన్నాయని భావించాలి

● ఎన్టీఆర్ జిల్లా వైసిపి లీగల్ సెల్ కార్యదర్శి సిరసాని ప్రకాష్



**విస్సన్నపేట,మే 4 (వార్తాప్రభ) :** స్థానిక నియోజకవర్గంలో పాఠశాల విద్యను అభ్యసించడంతోపాటు శాసనసభ్యునిగా తెలుగుదేశం పార్టీ తరపున పలుమార్లు తిరువూరు అసెంబ్లీ పరిధిలో గెలుపు ఓటములు సవిచూసిన నల్లగట్ల స్వామి దాస్ తెలంగాణ వ్యక్తిని ఒక వృద్ధ నాయకుడు మాట్లాడటం విచారకరమని జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి ప్రకాష్ అన్నారు. స్వామి దాసు సతీమణి ఉమ్మడి కృష్ణా జిల్లాలో జడ్పీ చైర్పర్సన్ గా ఎన్నిక జరిగినప్పుడు పలుమార్లు సందర్భాలలో సమావేశాలలో కలిసిన వ్యక్తి ఈనాడు తెలంగాణ వ్యక్తిగా స్వామిదాస్ కుటుంబాన్ని ఆపాదించటం విచిత్రంగా ఉన్నది అన్నారు. దేవినేని నెహ్రూ కుటుంబం రైతు కుటుంబం కాదని చెప్పటం మరీ విచిత్రంగా ఉన్నది అన్నారు. సీనియర్లకు తాము గౌరవం ఇస్తామని వారు ఏ పార్టీలో ఉన్న వాస్తవాలు మాట్లాడాలి తప్ప తాము మాట్లాడిన మాటలు అసత్యాలని నిజా నిజాలు ప్రజల గమనిస్తున్నారన్నారు. ఒకరిని వేలు ఎత్తి చూపేటప్పుడు అదే చేతికి సంబంధించిన మూడు వేళ్లు చూపించిన వ్యక్తి వైపు తిరిగి ఉంటాయన్న నగ్న సత్యాన్ని మరవకూడదన్నారు.

## నామ మాత్రపు ఫీజులకే కాలేజీ విద్య

● కెవిఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజ్ కరస్పాండెంట్ కె.వి.ఆర్





**విస్సన్నపేట,మే 4 (వార్తాప్రభ) :** నేటి సమాజంలో కుటుంబ తలసరి ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి విద్యార్థికి చదువు తోపాటు ఉద్యోగ ఉపాధిని అందించాలి అనే లక్ష్యంగా కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజీ ప్రారంభించడం జరిగిందని సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కే వెంకటేశ్వరరావు( కె.వి.ఆర్) తెలియజేశారు. మీ మా మనందరి కె.వి.ఆర్ కాలేజీ ప్రారంభించిన మొదటి సంవత్సరం 20 26 ఇంటర్ ఫలితాలలో వెటర్నరీ మేడ అభిలేఖ స్టేట్ ఫస్ట్ ర్యాంకు, అగ్రికల్చర్ జిల్లా ఫస్ట్ బెజవాడ మౌనిక, సర్వేయర్ డివిజన్ ఫస్ట్ నేలపట్ల అఖిల్ సాధించారని ఆయన చెప్పారు. 90 శాతం అత్యుత్తమ రిజల్ట్ సాధించటం విద్యార్థుల తల్లిదండ్రుల ఆశీస్సులు దేవుని ఆశీస్సులుగా భావిస్తాను అన్నారు. వినూత్న ఆలోచనలతో జూనియర్ కళాశాల నందు ఎంపీసీ బైపీసీ ఎంఎసి సిఇసి కోర్సులతోపాటు ఒకేషనల్ కోర్సులు వెటర్నరీ నర్సింగ్ ఎంఎల్టి అగ్రికల్చర్ ఫిజియోథెరపీ సర్వేయర్ తదితర కోర్సుల ఉత్తీర్ణత ఇంటర్మీడియట్ తో సమానమని నీట్ మరియు డిగ్రీ కూడా చదువుకోవచ్చని బస్సు సౌకర్యంతో పాటు ఏపీఎస్ఆర్టీసీ పాస్ సౌకర్యం హాస్టల్ వసతి అందుబాటులో ఉన్నాయని కె.వి.ఆర్ జూనియర్ కళాశాల మహిళా ప్రత్యేక క్యాంపస్ ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు 2026 -2027 విద్య సంవత్సరానికి అన్ని శాఖలలోనూ అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. మరిన్ని వివరాలకు 72078 44388, 9550090339 నెంబర్లకు ఇతర విషయాల కొరకు సంప్రదించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## యాదవుల ఐక్యతకు ప్రతీక సీతారామయ్య యాదవ్ విగ్రహం



**పిఠాపురం, మే 4 (వార్తాప్రభ) :** యాదవుల ఐక్యతకు స్వర్గీయ కుండల సీతారామయ్య యాదవ్ విగ్రహం ప్రతీకగా నిలుస్తుందని, పిఠాపురం యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గింజాల రామకృష్ణ అన్నారు.పట్టణంలోని స్థానిక కొత్తపేట ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న సీతారామయ్య యాదవ్ విగ్రహానికి పిఠాపురం యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతులు పూర్తయిన సందర్భంగా సోమవారం పునరుద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు. సీతారామయ్య యాదవ్, యాదవుల ఐక్యత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జోగ వెంకట రమణ, మాజీ కౌన్సిలర్ మతం లోవరాజును సంఘ సభ్యులు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఈగల కొండబాబు,గౌరవ సలహాదారులు ఈగల త్రిమూర్తులు, కార్యదర్శి కుండల సురేష్ కుమార్, ట్రెజరర్ కొల్లు దుర్గా ప్రసాద్, సభ్యులు మొల్లి కిశోర్, గింజాల నాని, మొల్లి బుజ్జి, యువజన అధ్యక్షుడు మతం సతీష్, ప్రముఖులు మొల్లి వెంకటరమణ, అల్లుబోయిన సత్యనారాయణ, గొర్ల పోలేశ్వరరావు, మొల్లి చిన్న, మతం బాబురావు, ఒమ్మి గోవింద్,మోరుకుర్తి సత్తిబాబు, వైబోయిన తాతారావు,బర్ల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అంపాపురం గ్రామం లో మమతల పంతిరి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం





**హనుమాన్ జంక్షన్,మే 4 (వార్తాప్రభ) :** అంపాపురం గ్రామం లో ఎమ్మెల్యే యార్లగడ్డ సేవా స్ఫూర్తి తో మమతల పందిరి సేవా సమితి మరియు తెలుగు యువత వలివేటి కిషోర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత కంటి వైద్య శిబిరం శంకర నేత్రాలయ వారితో నిర్వహించారు. 173 మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 63 మందికి ఉచిత కంటి ఆపరేషన్ లు శుక్రవారం నిర్వహిస్తామని శంకర్ కంటి నేత్రాలయ నిర్వాహకులు తెలియచేసారు. అలాగే నిరుపేదలు అయిన 20 మందికి అంపాపురం తెలుగుయువత ఉచితముగా కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంపాపురం గ్రామ పెద్దలు, మమతల పందిరి కుటుంబ సభ్యులు, యార్లగడ్డ సతీష్, దయాల రాజేశ్వరరావు, సర్నాల బాలాజీ, ఎన్ఆర్ఐ రాజా, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్





**తిరువూరు,మే 4 (వార్తాప్రభ) :** తిరువూరులో ఓల్డ్ ఎన్ఎస్పి క్వార్టర్స్ సమీపంలో డ్రగ్స్ పంపిణీ చేస్తున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వెల్లడించిన సీఐ గిరిబాబు వారి వద్ద నుండి సుమారు 2 కేజీల 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపిన సీఐ డ్రగ్స్ రహిత సమాజం కోసం డ్రగ్స్ పై దండయాత్ర 2.ఓ లో భాగంగా యువకులకు టెస్టులు చేయించి పాజిటివ్ ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని పేర్కొన్న సీఐ తిరువూరుకు చెందిన షేక్ మస్తాన్, ఏరమల దుర్గాప్రసాద్,నూజివీడుకి చెందిన బడుగు మాటి జితిన్ కుమార్, విసన్నపేటకు చెందిన ఇళ్ల గంగాధర్, ముత్తగూడెం కు చెందిన నూతనపాటి శ్రీను అనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించనున్నట్లు తెలిపిన సీఐ డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు పదార్థాలు సేవించిన రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సీఐ ఈ సమావేశంలో ఎస్ఐ శాతకర్ణి, సిబ్బంది పాల్గొన్నారు

## నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

● ఆస్తమా వ్యాధిపై ప్రజలకు అవగాహన : పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు



**తిరుపతి,మే 4 (వార్తాప్రభ) :** ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆస్తమా వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు ఎస్ వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి నందు శ్వాసకోశ వైద్య విభాగము ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్వాస కోస వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బారావు తెలిపారు. ఈ అవగాహనా కార్యక్రమం నందు శ్వాసనాలాల సామర్థ్యం తెలుసుకునే పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ మరియు ఆస్తమా తీవ్రతను గురించి అందరికీ అవగాహన కల్పించబడునని ఆయన అన్నారు. ప్రతి సంవత్సరం మే నెల మొదటి మంగళవారం జరుపుకునే ఈ దినోత్సవం ఉద్దేశ్యం ఆస్తమా వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స మరియు నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడం అని ఆయన తెలిపారు. పల్మనాలజీ విభాగాధిపతి , శ్వాస కోస వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఆస్తమా పూర్తిగా నియంత్రించగల వ్యాధి అని, వైద్యుల సూచనల మేరకు ఇన్హేలర్లు మరియు మందులను క్రమం తప్పకుండా వాడటం ద్వారా సాధారణ జీవితం గడపవచ్చని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరియు అలర్జీ సమస్యలున్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధూళి, కాలుష్యం, పొగ త్రాగడం, అలర్జీలు వంటి కారణాలు ఆస్తమాను మరింత తీవ్రమయ్యేలా చేస్తాయని తెలిపారు. కావున ప్రజలు గాలి కాలుష్యాన్ని తగ్గించాలని, పొగ త్రాగడాన్ని పూర్తిగా మానాలని, అలర్జీ కలిగించే కారణాలను దూరంగా ఉంచాలని, ఇన్హేలర్ వినియోగంపై సరైన అవగాహన కలిగి ఉండాలి, శ్వాసకోశ సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఆస్తమా లక్షణాలు :** శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, ఛాతీలో బిగుతు, పిల్లి కూత శబ్దాలు ఊపిరి సలపకపోవడం వంటివి. ఇవి తరచుగా కనిపిస్తున్నాయా ఆస్తమా కావచ్చు. ఆస్తమా వ్యాధి లో శ్వాసనాలాల వాపుని నియంత్రణ చెసే స్టీరాయిడ్ (ఇన్హేలర్)మంధు అందరికి అందుబటులో తీసుకురావడం ముఖ్య ఉద్దేశం అని ఆయన తెలియజేశారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ఎస్ వి వైద్య కళాశాల కార్యాలయ ప్రాంగణము భువన విజయం ఆడిటోరియం నందు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్న 2 గంటల వరకు ఊపిరితిత్తుల సామర్థ్యం తెలుసుకునే పరీక్ష మరియు ఆస్తమా తీవ్రతను తెలిపే పరీక్ష రోగులకు ఉచితముగా చేయనని శ్వాస కోస వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బారావు తెలిపారు.

## అన్నదానంకు, గోసం రక్షణకు పలువురు విరాళాలు





**పెనుగంచిప్రోలు,మే 4 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు నిత్య అన్నదానం కు గుంటూరు జిల్లా తెనాలి పట్టణ వాస్తవ్యులు గుంటూరు కోటేశ్వరరావు విజయలక్ష్మి దంపతులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్య అన్నదాన పథకములకు 15,968 రూపాయలు , ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామ వాస్తవ్యులు కోటగిరి కిరణ్ కుమార్ ప్రియాంక దంపతులు శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు 10,116 రూపాయలు, మరియు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చింతపల్లి గ్రామ వాస్తవ్యులు జెర్రిపోతుల పుల్లారావు శ్రీ అమ్మవారి దేవస్థానం గో సంరక్షణకు 5000 రూపాయలు విరాళములు శ్రీయుత డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి బి మహేశ్వర్ రెడ్డి సూచనల మేరకు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు, వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు..

## "జనసేన" శివా కీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధ్యక్షులు "సామినేని"



**పెనుగంచిప్రోలు,మే 4 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ పెనుగంచిప్రోలు మండల అధ్యక్షుడు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తునికిపాటి శివా కి ఎన్ టీ ఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయ భాను జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా ఉదయ భాను మాట్లాడుతూ శివ ఆయురారోగ్యాలతో, ఆనందంతో, విజయాలతో నిండిన జీవితం గడపాలని కోరుకుంటున్నా అన్నారు. ప్రజలకు మరింత సేవ చేయడానికి మీరు ఎల్లప్పుడూ ముందుండాలని ఆకాంక్షిస్తూన్న అన్నారు.

## ఇండియన్ సినిమాకు దాసరి జీవిత సాఫల్య పురస్కారం





**విస్సన్నపేట,మే 4 (వార్తాప్రభ) :** నాడు వందేమాతరం మూవీ కి ఉత్తమ దర్శకుడుగా అవార్డు సాధించిన బివి రత్నం కు ఇండియన్ మూవీ కి సంబంధించి దాసరి ఫిలిం ఫెస్టివల్ నందు దాసరి జీవిత సాఫల్య పురస్కారం హైదరాబాద్ రవీంద్ర భారతి నందు జరిగిన కార్యక్రమంలో ఆయనకు లభించింది. మూవీ రంగంలో 24 ఫ్రేమ్స్ నందు విశిష్ట అనుభవం కలిగిన వారికి లభించే ఈ అత్యున్నత పురస్కారం తనను గుర్తించి ఇవ్వటం జరిగిందని బివి రత్నం ఫిలిమ్స్ డైరెక్టర్ బి.వి రత్నం పత్రికా ప్రతినిధుల సమావేశంలో తెలియజేశారు.

## వాసిరెడ్డి బేనార్జీ ని పరామర్శించిన ఎమ్మెల్యే వసంత



**పెనుగంచిప్రోలు,మే 4 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో సోమవారం శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్, అయ్యప్పస్వామి సేవా సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పరామర్శించారు. వాసిరెడ్డి బెనర్జీ భార్య వాసిరెడ్డి శంకర భవాని ఇటీవల కాలంలో మరణించినారు. ఈ రోజున బెనర్జీని కలసి ఏం.ఎల్. ఏ.సానుభూతి ని తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వేగినేటి గోపాల కృష్ణ మూర్తి,శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి దేవస్థానం మాజీ చైర్మెన్ కాకాని శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు పార్టీ అధికార ప్రతినిధి నలమోలు శివరామ కృష్ణ ప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యులు గజ్జి కృష్ణ మూర్తి, మాజీ సొసైటీ అధ్యక్షుడు నల్లపునేని వెంకటనారాయణ, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కంచేటి శ్రీనివాసరావు, శ్రీ వేణు గోపాల స్వామి రుక్మిణి సత్యభామ దేవస్థానం చైర్మెన్ కొమరగిరి రఘురామారావు , వేగినేటి, వేంకటేశ్వర రావు. తాడిపినేని సత్యం బాబు, శాస్త్రి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**69 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ**



**శేరిలింగంపల్లి,మే 4:(వార్తాప్రభ):** శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పేట్, చందానగర్,భారతి నగర్ (పార్ట్) డివిజన్లకు చెందిన 69 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకం కింద రూ. 69,08,004 ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశారు.మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ 69 మంది లబ్ధిదారులకు రూ.69,08,004 విలువైన చెక్కులు అందజేయడం ఆనందకరమని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా, పేదింటి ఆడబిడ్డలకు పెద్ద అన్నలా అండగా నిలుస్తున్నారని కొనియాడారు.దేశంలో ఎక్కడా లేని విధంగా మానవతా దృక్పథంతో కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు సంతోషంగా జరగేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు, మహిళలు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వి. హనుమంతరావు ని ఘనంగా సన్మానించిన అఖిల భారత యాదవ మహాసభ నాయకులు





**హైదరాబాద్ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** క్యాబినెట్ హోదాలో తెలంగాణ ప్రభుత్వ బి.సి. సంక్షేమ మరియు అభివృద్ధి సలహాదారుగా నియమితులైన మాజీ రాజ్యసభ సభ్యులు, పీసీసీ మాజీ అధ్యక్షులు వి. హనుమంతరావు ని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్ మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హనుమంతరావు కి శాలువా కప్పి, గజ మాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన బి.సి.వర్గాల నేత వి. హనుమంతరావు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల (బి.సి.) హక్కుల కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న ఆయన, ప్రభుత్వ సలహాదారుగా బి.సి.ల సంక్షేమానికి మరింత బలాన్ని చేకూరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దారబోయిన శ్రీనివాస్ యాదవ్ (రాష్ట్ర కోశాధికారి), దొంతిబోయిన శ్రీనివాస్ యాదవ్ (రాష్ట్ర కార్యదర్శి), గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ (రాష్ట్ర యువజన అధ్యక్షులు), బి. ధనరాజ్ యాదవ్ (రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు), వి. మహేష్ యాదవ్ (రాష్ట్ర యువజన కార్యదర్శి), రాజబోయిన నరేష్ యాదవ్, కరణ్ యాదవ్ మరియు తదితర యాదవ సంఘ నేతలు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వార్తా ప్రభ

# హైదరాబాద్

## జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపును కోరుతూ గత పది రోజులుగా కొనసాగుతున్న నిరవధిక రిలే నిరాహార దీక్షలు విరమణ



**దమ్మాయిగూడ, మే 04:(వార్తా ప్రభ)** డంపింగ్ యార్డు వ్యతిరేక జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో దమ్మాయిగూడ లో నిర్వహించిన ఈ దీక్షలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు ముగించారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ జేఏసీ ప్రతినిధులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ గోగుల సరిత,కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ముప్పు రామారావు, కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు మరియు మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, జేఏసీ ప్రతినిధులు శంకర్ నారాయణ, పద్మచారి,ఎనుగు సంజీవరెడ్డి, మారం సమ్మిరెడ్డి,గావిని స్వర్ణ శ్రీనివాస్ లు,జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ కుతాడి సాయికుమార్, మాజీ దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్,శంకర్ గౌడ్,కోటేష్ గౌడ్,దుర్గ ప్రసాద్ గౌడ్, గజ్వేల్ శంకర్, మాజీ కౌన్సిలర్ సాయి, వినయ్. జేఏసీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్నికల ఫలితాలపై ప్రజలకు భ్రమలు లేవు

**- సిపిఐ(ఎం-ఎల్) చండ్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి.**



**జవహర్ నగర్, మే 04:(వార్తా ప్రభ)** సోమవారం రోజు వెలువడిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ప్రజలకు ఎలాంటి భ్రమలు లేవని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి స్పష్టం చేశారు. పుదుచ్చేరి, అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఏ పార్టీ కూడ ప్రజల ప్రాథమిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాల కొరకు ప్రజల ముందు పెట్టలేదని అన్నారు. వారి ప్రణాళికలలో అమలుకు సాధ్యం కానీ విచ్చలవిడి హామీలతో ఎన్నికలను ఒక అట్టహాసంగా మార్చారని అన్నారు. కేంద్రంలో బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం అయితే అన్నిరకాల అధికార దుర్వినియోగానికి పాల్పడడమే గాకుండా, రాజ్యాంగ వ్యవస్థలన్ని ఎన్నికలకు ముందే తనగుప్పిట బందించి, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించు కోవడానికి చేయాల్సిన ప్రయత్నాలన్ని చేసిందని పేర్కొన్నారు. మరోవైపు గెలుపు ఓటములను ప్రభావితం చేయగలిగే మైనారిటీ ఓట్లను చీల్చడానికి ఒక మెజారిటీ హిందు మతతత్వ బీజేపీ పార్టీ, తన బినామీ మైనారిటీ మతతత్వ ఏంఐఎం పార్టీ ద్వారా ముస్లిం ఓట్లను చీల్చి, మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి కారణం అయ్యిందని అన్నారు. ఎన్నికల కమీషన్ తన రాజ్యాంగ బద్ధమైన భాధ్యతను, కర్తవ్యాన్ని విస్మరించి, కేంద్రంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ప్రజలలో నెలకొని ఉండడం ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మసకబారిందని అన్నారు. భూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పచ్చి భూటకమనే విషయాన్ని ప్రజలు నేడు గుర్తించారని అన్నారు. కుల, మత, ప్రాంతం ఆధారంగా జరిగిన ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా లక్షల కోట్ల డబ్బు, మద్యం లాంటివి పోటీపడి పంచి పెట్టి, అన్నిరకాల అనైతిక చర్యలతో గెలవడానికి నానాగడ్డీ కరిచాయని మండిపడ్డారు. ముఖ్యంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ లాంటి మతతత్వ మనువాదులు రెచ్చగొట్టే, విద్వేష ప్రచారాలు మెజారిటీ హిందూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేసిందని అన్నారు. ఇలా భూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అవకాశవాద రాజకీయ విధానానికి ఒక ప్రహసనంగా మారిందనడానికి నగ్నంగా నేడు జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే నిదర్శనం అన్నారు. కాబట్టి గెలిచిన పాలకవర్గాలు ప్రజాస్వామ్యం అనే మేలి ముసుగులో ప్రజలను మరింత మోసపూరితమైన విధానాలతో దోపిడీ చేయడానికి, ప్రశ్నించి, పోరాడే శక్తులను మరింత దుర్మార్గంగా, క్రూర అణివేతకు అధికారాన్ని ఒక సాధనంగా ఉపయోగించే ప్రమాదం ఉన్నందున సెక్యులర్, మేదావి, దళిత, క్రిస్టియన్, ఆదివాసీ ప్రజలు పౌర, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణలో ముందుండి పనిచేస్తున్న ఉద్యమ శక్తులతో బాగస్వాములు కావాలని షేక్ షావలి పిలుపునిచ్చారు. ఇప్పటికే మతతత్వ రాజకీయ విధానాలతో దేశంలో ప్రజల మౌలిక సమస్యలను పక్కదారి పట్టించారని, వాటి పరిష్కారం కొరకు వర్గ పోరాటాలను తీవ్రతరం చేయడానికి పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాలు శ్రమించాలని సూచించారు.

# చేబ్రోలు రథప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

**న్యాయం కోసం ప్రభుత్వానికి డిమాండ్**



**కాకినాడ, మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలంలో చేబ్రోలుగ్రామంలో జరిగిన శ్రీరామనవమి రథప్రమాదంలో మృతిచెందిన దుక్కా వెంకటేష్ కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు కుర్రా శ్రీనివాస్ యాదవ్ , స్థానిక నాయకురాలు డా. అనూష యాదవ్ మరియు స్థానిక నాయకులు పరామర్శించారు.ప్రమాదం జరిగి నెలరోజులు గడిచినప్పటికీ ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు నుంచి ఇప్పటివరకు ఎటువంటి నష్టపరిహారం లేదా బాధిత కుటుంబానికి ఉపాధి భరోసా కల్పనపై స్పష్టమైన చర్యలు లేకపోవడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం నాయకులు ప్రెస్ మీట్ నిర్వహించి, తక్షణమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాల్లో గతంలో జరిగిన పారిశ్రామిక ప్రమాదాల్లో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా ఈ ఘటనలో కూడా బాధిత కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో చదువుకున్న సోదరుడు లేదా సోదరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే డా. అనూష యాదవ్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి తక్షణ ఎక్స్‌గ్రేషియా ప్రకటించడంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ఇంకా నిర్లక్ష్యం చేసినట్లయితే, తదుపరి పోరాట కార్యక్రమాలు చేపట్టి, అవసరమైతే ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లకుండా కాలయాపన చేయడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో మృతుడు వెంకటేష్ తండ్రి దుక్కా శ్రీను, ఎక్స్ ఎంపీటీసీ సింగంపల్లి రాంబాబు, అయితే నాగేశ్వరరావు, నమ్మి అప్పారావు, పీతల శ్రీను, కుక్క శ్రీను, దుర్గా మణికంఠ, తుపాటి దుర్గా, ఉప్పల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రూ.577 కోట్ల అభివృద్ధి పనులు పురోగతిలో!!

**మహిళల ఆర్థిక సాధికారతకు సోలార్, పెట్రోల్ బంక్‌లు**

**రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**





**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 4 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం ఎన్టీపీసీ కాకతీయ కళా భవనంలో జరిగిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అర్హులందరికీ చేరాలని అన్నారు. పేదలు, మహిళల సంక్షేమ పథకాలపై సరైన అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి తగ్గుతోందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం వినూత్న పథకాలు అమలు చేస్తోందని కొనియాడారు. రామగుండం అభివృద్ధికి భారీగా నిధులు సమీకరిస్తున్నామని చెప్పారు. నగరంలో రూ.577 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, సింగరేణి ద్వారా రూ.105 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఆసుపత్రులు, రోడ్లు వంటి పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ లక్ష్యంగా భూసేకరణ జరుగుతోందని వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మేయర్ మహంకాళి స్వామి నగర పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశం అనంతరం స్త్రీనిధి, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

# పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి సాంప్రదాయ కళలలో శిక్షణ ఇప్పించండి

**శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి కిషన్ రావు**





**శేరిలింగంపల్లి,మే4 (వార్తాప్రభ):** మాదాపూర్‌లోని శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్ క్యాంపు సోమవారం ప్రారంభ మైంది.ఈ క్యాంపులో పాటరీ, పెన్సిల్ స్కెచ్,మధుబని పెయింటింగ్, పటచిత్ర పెయింటింగ్, అక్రిలిక్ పెయింటింగ్, సీషెల్ క్రాఫ్ట్స్, వాటర్ కలర్స్, క్లే టాయ్స్, లిప్పన్ ఆర్ట్ వర్క్‌లలో పిల్లలు మరియు పెద్దలకు శిక్షణ అందిస్తున్నారు.ప్రారంభమైన తొలి రోజునే పాల్గొన్న వారు ఆసక్తిగా శిక్షణ పొందుతూ తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.సంప్రదాయ కళలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి. కిషన్ రావు మాట్లాడుతూ, పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి ఇటువంటి సాంప్రదాయ కళల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి సృజనాత్మకతను వెలికితీయవచ్చని తెలిపారు.ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్‌లో మరింత ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

# ఖరీఫ్ సీజన్ సి ఎం ఆర్ బియ్యం నిర్ణీత గడువులోగా

# అందించాలి- జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్,మే 04 (వార్తా ప్రభ ప్రతినిధి)** ::,2025 ఖరీఫ్ సీజన్ సి ఎం ఆర్ బియ్యంను నిర్ణీత గడువులోగా అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ తో కలిసి 2025 ఖరీఫ్ సి ఎం ఆర్ బియ్యం, వరి ధాన్యం దిగుమతి పై రైస్ మిల్లర్ల యాజమాన్యంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన బియ్యాన్ని రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా ప్రభుత్వానికి అందించాలని తెలిపారు. 2025-26 యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేపట్టడం జరిగిందని, అర్హత గల బాయిల్డ్ రైస్ మిల్లర్లు, రా రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజిత, అధికారులు, రైస్ మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరుతో రైతుల జీవనాధారాన్ని తాకట్టు పెట్టడం సమంజసం కాదు.

**ప్రభుత్వం తమ విజ్ఞప్తిని పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు**

**హెచ్చరిస్తున్న బట్ల చందరారం గ్రామ రైతులు**



**వికారాబాద్,మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి):** దోమ మండలం, బట్ల చందరారం గ్రామంలోని రైతుల పంట భూములను ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలపై గ్రామ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 93 మంది రైతులు కలిగి ఉన్న సుమారు 235 ఎకరాల పట్టా పంట భూములు మరియు లావణ్య పట్టా 12.37 గుంటలు రైతుల జీవనాధారం. అదేవిధంగా పరిగి నియోజకవర్గంలోని ఐదు గ్రామాల రైతుల వద్ద నుంచి సుమారు 2145 ఎకరాల వరకు పంట భూములు ప్రభావితం అయ్యే పరిస్థితి ఉందని వారు ఒక సమావేశంలో తెలిపారు. ఈ భూములు అత్యంత సారవంతమైనవి. సంవత్సరానికి రెండు నుండి మూడు పంటలు పండుతుండగా, ఈ భూములపై ఆధారపడి రైతులు తమ కుటుంబాలను పోషిస్తున్నారు. ఇలాంటి భూములను స్వాధీనం చేసుకోవడం వల్ల రైతులు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పేర్కొన్నట్లు, గతంలో పోలేపల్లి సెజ్ మరియు జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతాల్లో భూములు స్వాధీనం చేసుకున్న తర్వాత రైతులు ఎదుర్కొన్న సమస్యలు, నిరుద్యోగం, జీవనోపాధి సంక్షోభం, పరిహారం ఆలస్యం వంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదనీ వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితులు తమ గ్రామంలో పునరావృతం కాకూడదని వారు స్పష్టం చేశారు. రైతులు అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ రైతులకు పూర్తి న్యాయం, సరైన పరిహారం, భవిష్యత్తుకు భరోసా లేకుండా భూములను స్వాధీనం చేసుకోవడం అంగీకరించబోమని వారు స్పష్టంగా తెలిపారు. అభివృద్ధి పేరుతో రైతుల జీవనాధారాన్ని తాకట్టు పెట్టడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా అధికారులను కలిసి తమ సమస్యను వివరించినప్పటికీ సరైన స్పందన రాలేదని రైతులు తెలిపారు. అధికారులు రైతుల విన్నపాలను పట్టించుకోకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ప్రభుత్వాన్ని ఉద్దేశించి, వెంటనే స్పందించి పంట భూములను కాపాడాలని, లేకపోతే రైతులకు పూర్తి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రైతుల భూములు కాపాడకపోతే, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టే పరిస్థితి తలెత్తుతుందని వారు హెచ్చరించారు. "మా భూమి మా హక్కు... రైతు బతికితేనే దేశం బతుకుతుంది" అనిబట్ల చందరారం గ్రామ రైతులుబైకని శ్రీశైలం యాదవ్, నిమ్మలి తిరుమల్లేష్, వార్ల బుగ్గయ్య, గొల్ల మొగులయ్య, కావాలి శ్రీశైలం ముదిరాజ్, కావాలి బాలయ్య లు పేర్కొన్నారు.

# సూపర్ సమ్మర్ ఏఐ-రోబోటిక్స్ క్యాంప్ షురూ!!

**ఏఐ యుగానికి రెడీ అవుదాం**

**ఫ్యూచర్ అంతా టెక్నాలజీనే**

**అదనపు కలెక్టర్ అరుణ శ్రీ**



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 4 (వార్తాప్రభ ప్రతినిధి)** గోదావరిఖనిలోని గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం 'సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏఐ రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాం' ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ ఫైబర్ గ్రిడ్, టీ ఫైబర్, సూపర్ టీచర్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సమ్మర్ క్యాంప్‌ను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం కమిషనర్ అరుణశ్రీ ప్రారంభించి విద్యార్థులతో ముచ్చటించారు. వేసవి సెలవులను సృజనాత్మకంగా వాడుకుంటూ కంప్యూటర్, ఏఐ, రోబోటిక్స్‌పై ప్రాక్టికల్ నాలెడ్జ్ సంపాదించుకోవాలని ఆమె విద్యార్థులకు పిలుపునిచ్చారు. భవిష్యత్తు టెక్నాలజీదేనని, ఇలాంటి శిక్షణ విద్యార్థుల స్కిల్స్‌ను మెరుగుపరుస్తుందని కొనియాడారు. క్యాంప్‌లో కంప్యూటర్ వినియోగం, రోజువారీ జీవితంలో ఏఐ ఉపయోగాలు, సింపుల్ రోబోటిక్స్ మోడల్స్ తయారీ, ప్రాజెక్ట్ ప్రదర్శనలపై ప్రాయోగిక శిక్షణ ఇవ్వనున్నారు. నిర్వాహకులను అభినందించిన అరుణశ్రీ, ఏఐ-రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాం 'భేష్' అంటూ ప్రశంసించారు. టీ ఫైబర్ మేనేజర్ శ్రీరామ్ రాహుల్ జువ్వాడి బృందం కూడా హాజరైంది. ఈ సమ్మర్ కోచింగ్ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏంఈఓ మల్లేశం, డీఆర్పీ రవి, హెచ్ఎం రాంబాబు, స్వరూప్ చంద్, రమేష్, పీఆర్పీ శ్రీలత పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## విజయ్ గెలుపు వెనక సంచలన విషయాలు!

తమిళనాడులో విజయ్ పార్టీ ప్రభంజనం కొనసాగుతోంది. విజయ్ పార్టీ టీవీకే అనూహ్యమైన ఫలితాలను సాధిస్తోంది. ఆ పార్టీకి తమిళ జనాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. త్రిముఖ పోరులో విజయ్ పార్టీ ఏమి సాధిస్తుంది అనుకున్న వారికి సరైన జవాబుగా టీవీకే సాధిస్తున్న ఫలితాలు ఉన్నాయి. అసలు ఎవరు ఊహించని విధంగా విజయ్ టీవీకే తమిళనాడులో రాజకీయ సునామీ సృష్టించింది. నిజానికి ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఏవీ కూడా విజయ్ పార్టీ ఇన్ని సీట్లు సాధిస్తుందని ఎక్కడ అంచనా వేయలేదు. అయితే ఒకే ఒక సర్వే సంస్థ యాక్సిస్ మై ఇండియా మాత్రం విజయ్ పార్టీ టీవీకేకి 98 నుంచి 120 దాకా సీట్లు సాధిస్తుందని అంచనావేసింది. ఈరోజు ఇదే అదే నిజమైంది ఇదిలా ఉంటే విజయ్ పార్టీకి కలసి వచ్చిన అంశాలు ఏమిటి అన్న చర్చ ఇపుడు వేడిగా వాడిగా సాగుతోంది. విజయ్ సినిమా రంగం నుంచి రాజకీయ రంగంలోకి అడుగు పెట్టారు. అందరి మాదిరిగానే ఆయన కూడా సినిమాల్లో టాప్ స్టార్ గా ఉంటూ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అయితే సినీ రంగం నుంచి రాజకీయ రంగంలోకి రావాలని కోరిక ఈనాటిది కాదు. ఆయన 2009 లోనే తన అభిమాన సంఘాలన్నీ కలుపుకుంటూ తన అభిమాన సంఘాలను అన్నింటినీ కలిపి అతి పెద్ద కూటమిగా సృష్టించారు ఆయన దాని ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు విజయ్ నిర్వహిస్తూ వచ్చారు. దాంతో అప్పుడే విజయ్ కి రాజకీయాలు పట్ల ఆసక్తి ఏర్పడింది అని అంతా అనుకున్నారు. ఇక తన ఫ్యాన్ కబ్బులన్నీ ఏకం చేస్తూ విజయ్ మక్కల్ ఇయక్కం వీఎమై ని ఏర్పాటు చేశారు. ఇది మొదట్లో సామాజిక సేవా సంస్థగా ఉన్న 2011 ఎన్నికల్లో అన్న డీఎంకే నేతృత్వంలో కూటమికి తొలిసారి మద్దతు ఇచ్చి తన రాజకీయ ఆకాంక్షను బయట పెట్టుకుంది. అలా విజయ్ అభిమాన సంఘాల కూటమిని 2020 ప్రాంతాల్లో ఆయన తండ్రి చంద్రశేఖర్ రాజకీయ పార్టీగా రిజిస్టర్ చేయించారు. అయితే దాన్ని విజయ్ తిరస్కరించారు. ఆ విధంగా అభిమాన సంఘాల కూటమి పేరుతో ఏర్పాటైన పార్టీ పక్కకు పోయింది. ఇక ఆయన అభిమాన సంగాలలోని వారిలో కొందరు ఔత్సాహికులు అంతా కలిసి గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తే మంచి ఫలితాలు వచ్చాయి ఏకంగా 169 స్థానాలకు గాను 115 స్థానాలు వారు గెలిచారు. దాంతో విజయ్ పొలిటికల్ స్టామినా ఏమిటో అందరికీ తెలిసింది. ఈ తర్వాత రాజకీయ ఆకాంక్ష విజయ్ లో మరింతగా పెరిగింది. ఆ తర్వాత 2024 లో ఆయన రాజకీయ పార్టీగా టీవీకేగా స్థాపించారు. అప్పటి నుంచి ఆయన ప్రజల్లో ఉంటూ తన పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కేవలం రెండేళ్ల కాలం విజయ్ పడిన ప్రశ్రమ, తపన చేసిన ప్రచారం అభిమాన సంఘాల కృషి ప్రజల్లో వచ్చిన మార్పు అన్నీ కలిసి ఈరోజు టీవీకే తమిళనాట ప్రభంజనం సృష్టించేందుకు కారణమయ్యాయి. తమిళనాడులో ఎనాటి నుంచో న్న రెండు ద్రవిడ పార్టీలను పక్కనపెట్టి విజయ్ పార్టీకి ప్రజలు పట్టం కట్టేందుకు ఆస్కారం ఏర్పడింది అంటే దాని వెనకాల విజయ్ చేసిన కృషి ఎంతగానో ఉంది. అలాగే ఆయన చాలా పట్టుదలగా రాజకీయాల్లో విజయం సాధించేందుకు శ్రమించారు. తాను రాజకీయాలకు ఒక లక్ష్యం కోసం వచ్చానని వెనక్కి మళ్ళీ వెళ్లే ప్రసక్తి లేదని తొలి ప్రసంగంలోనే ప్రజలకు విజయ్ స్పష్టం చేశారు. తన నిబద్ధత ఏమిటో చాటి చెప్పారు తాను అనుకున్నది చేస్తానని కూడా గట్టిగా చెప్పుకొచ్చారు. ఇక తనకు రాజకీయాలనేది మరొక వృత్తి కాదని ప్రజాసేవ అన్నది తనకు పవిత్రమైనదని ఆయన ప్రజలకు చెప్పి వారి మనసుల్లో స్థానం సంపాదించారు. దాని ఫలితమే ఈరోజు టీవీకే ఘన విజయం ఇక విజయ్ రాజకీయంగా తన ఇన్నింగ్స్ ని అధికారి హోదాలో త్వరలో ప్రారంభించబోతున్నారు అది ఏ తీరుగా ఉంటుందన్నది వేచి చూడాల్సిందే.

## జోన్లను నిర్ధారించి నివేదికను సమర్పించండి

**విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జోన్లను నిర్ధారించి నివేదికను సమర్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. సోమవారం మధ్యాహ్నం ప్రధాన కార్యాలయంలోని తమ ఛాంబర్ లో స్ట్రీట్ వెండింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులు వ్యాపారం చేసుకునేందుకు గ్రీన్, అంబర్, రెడ్ జోన్ల నిర్ధారణ ఇప్పటికే వీధి వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, ట్రాఫిక్ పోలీస్ వారి సమన్వయంతో తయారుచేసినందున, ఏమన్నా లోపాలున్నా మార్పు చేతుకులు ఉన్న తుది నివేదికను కమిటీ సమక్షంలో చర్చించి తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వీధి వ్యాపారస్తుల సర్వే ఈ వారంలో పూర్తిచేయాలని వీధి వ్యాపారస్తులకు స్వానిధి లోన్ల గురించి కేవలం అవగాహన కల్పించడమే కాకుండా వారికి సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, లైసెన్స్ లేని వీధి వ్యాపారస్తులు వీధిలో వ్యాపారం చేయకూడదని అన్నారు. వీధి వ్యాపారస్తులకు ఎటువంటి సమస్యనైనా కమిటీ సభ్యులు తమ వద్దకు తీసుకురావచ్చు అని, ఎటువంటి సమస్యనైనా పరిష్కరించే దిశగా టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు వివరిస్తారని తెలిపారు. విధి వ్యాపారస్తుల కమిటీ సభ్యులు వీధి వ్యాపారస్తులకు సంబంధించిన ఎటువంటి సమస్యనైనా కమిటీలో చర్చించి కమిటీ తీసుకున్న నిర్ణయాలను విధి వ్యాపారస్తులకు తెలియజేయాలని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) ఎం. విజయలక్ష్మి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్లు ప్రభుదాస్, కె. షమ్మీ, డిసిపి చంద్రబోస్, ఎసిపిలు రాంబాబు, మోహన్ బాబు, బ్రాంచ్ మేనేజర్ ఎమ్ సుధాకర్, కమిటి సభ్యులు అయిన వీధి వ్యాపారస్తులు ఎల్ వి మూర్తిరావు చిప్పడ, వడ్లమూడి శ్రీనివాస్, నాగ వెంకట బాలకృష్ణ, షేక్ సబీర్, బొమ్మిసెట్టి జగన్మోహన్ రావు, కంకిపాటి రత్నకుమారి, పిల్లి నాగమల్లేశ్వరి తదితర్లు , పాల్గొన్నారు.,

# సమాజశ్రేస్సుకు మీడియా సేవలు మరువలేనిది

- జన చైతన్యం మరింత అభివృద్ధి కావాలి
- విజయవాడ వెస్ట్ జోన్ ఏసీపీ ఎన్. దుర్గారావు వెల్లడి
- ఘనంగా ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ వేడుకలు





**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పత్రికా స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేలా పని చేయడంలో మీడియా రంగం కీలమని పోషిస్తుందని వెస్ట్ జోన్ ఏసీపీ ఎన్. దుర్గారావు అన్నారు. జన చైతన్యం డిజిటల్ మీడియా ఆధ్వర్యంలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకోని ఆదివారం వించిపేట శ్రీ విద్యాంజలి స్కూలులో నిర్వహించగా, ముఖ్య అతిధిగా ఏసీపీ దుర్గారావు హాజరై ప్రసంగించారు. గత పదేళ్లుగా వెస్ట్ జోన్ లో విధులు నిర్వహిస్తున్న క్రమంలో మీడియా మిత్రుల సహకారం మరువలేనిదన్నారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో చెడుతో పాటు, మంచి అంతే వేగంగా సమాచారం తెలుస్తుందన్నారు. తప్పుడు వార్తలు కాకుండా నిజాలను నిర్భయంగా ప్రచురించాలని ఆయన కోరారు. జన చైతన్యం వ్యవస్థాపకులు పల్లేటి ఆనంద్ విరాట్ మాట్లాడుతూ మరుగున పడిపోతున్న జర్నలిజం విలువలను తిరిగి కాపాడేందుకు సరికొత్త ప్రయత్నంగా జన చైతన్యం నాంది పలకనుందన్నారు. అవినీతిలో కురుకుపోయిన వ్యవస్థల్లో సైతం మార్పు తీసుకువచ్చినప్పుడే నిజమైన జర్నలిజం అవుతుందన్నారు. జన చైతన్యం మేనేజింగ్ డైరెక్టర్ వాండ్రాశి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా పత్రిక విలువలను కాపాడుకోవడానికి జన చైతన్యం మరొక ముందడుగు వేయనుందన్నారు. అదేవిధంగా పలువురు పాత్రికేయులు, మీడియా ఛానల్స్ పని చేస్తున్న రిపోర్టర్లు భవిష్యత్ జర్నలిజం ఏలా ఉండబోతుందనే అంశంపై పలు సూచనలు చేశారు. అనంతరం పత్రికా విలేకరులకు, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో సేవలందిస్తున్న మీడియా మిత్రులకు ప్రశంసా పత్రం, జన చైతన్యం తరఫున జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యాంజలి స్కూల్స్ అధినేత పుప్పాల శ్రీనివాసరావు, ఆర్టీఏ యాక్టివిస్ట్ చిన్ని రూప్ నాథ్, సీనియర్ పాత్రికేయులు యేమినేని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ అంతరంగానికి సాక్ష్యంగా నిలిచేదే సాహిత్యం

**విశ్వకర్మ వేద విజ్ఞానమ్' పుస్తకావిష్కరణ సభలో కలిమిశ్రీ.**



**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏ సాహిత్యమైనా కేవలం అలంకారప్రాయం కాకూడదు, అది కాలానికి, సమాజానికి సాక్షీభూతంగా నిలవాలని అన్నారు నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ. ఆదివారం సాయంత్రం పటమట వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్యానమందిరంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ కొండపి శ్రీ వేంకట గణేష్ బాబు సంకలనం చేసిన 'విశ్వకర్మ వేద విజ్ఞానమ్'. బ్రహ్మశ్రీ తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు రచించిన వేద విజ్ఞానమ్' గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభలో విశ్వకర్మ వేద విజ్ఞానమ్ గ్రంథాన్ని నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకులు కలిమిశ్రీ , వేద విజ్ఞానమ్ గ్రంథాన్ని ప్రఖ్యాత న్యూరోసర్జన్ డాక్టర్ వజ్రాల శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవమల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ మాట్లాడుతూ – ప్రాచీన సాహిత్యమైనా, ఆధునిక సాహిత్యమైనా, విప్లవ సాహిత్యమైనా, ఆధ్యాత్మిక సాహిత్యమైనా, భక్తి సాహిత్యమైనా ఆయా కాలాల మానవ సమాజపు వేదనల్ని, భాషా సంస్కృతుల్ని, సంప్రదాయాల్ని ప్రతిబింబించాలన్నారు. విశ్వకర్మ వేద విజ్ఞానమ్ గ్రంథంలో రచయిత వేంకట గణేష్ బాబు వేదాలు, పురాణాల నుండి మానవ వికాసానికి ఉ పయుక్తమయ్యే కీలకమైన సూక్తుల్ని, శ్లోకాల్ని తీసుకుని వాటికి సరళమైన భావార్థాలను తెలియజేశారన్నారు. వేద విజ్ఞానమ్ గ్రంథాన్ని ఆవిష్కరించిన డాక్టర్ వజ్రాల శివకుమార్ మాట్లాడుతూ విశ్వకర్మ సాహిత్య ప్రచారం కోసం పిల్లలకు సంస్కృతం నేర్పాలన్నారు. సభకు ఆచార్య చంద్రపాటి అధ్యక్షత వహించారు. పుస్తక రచయితలు బ్రహ్మశ్రీ కొండపి శ్రీ వేంకట గణేష్ బాబు, బ్రహ్మశ్రీ తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు తమ స్పందనని తెలియజేశారు. సాహితీ వేత్త పి.బి.డి.వి ప్రసాద్ గ్రంథాలను పరిచయం చేశారు. విక్రమ్ పబ్లిషర్స్ అధినేత గొర్తి శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడారు. బ్రహ్మశ్రీ అప్పలభక్తుల శివకేశవరావు సభాసమన్వయం చేశారు.

# ఎగ్జిబిషన్లో అగ్నిమాపక చర్యలు కచ్చితంగా పాటించాలి





**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎగ్జిబిషన్లో అగ్నిమాపక చర్యలను తప్పకుండా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ అన్నారు. ఆదివారము ఉదయం సితార సెంటర్, పున్నమి ఘాట్ భవానిపురం ప్రాంతాలలో ఉన్న ఎగ్జిబిషన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ నిర్వహణలో అగ్నిమాపక చర్యలు కచ్చితంగా పాటించాలని ఎటువంటి అగ్నిప్రమాదం జరగకుండా ప్రతిచోట ప్రతిష్టాల్లో కచ్చితంగా నివారణ చర్యలు పాటించాలని ప్రతిష్టాలు పైన అత్యవసర నంబర్లను సూచించాలని, ఎగ్జిబిషన్ ప్రాంగణంలో అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే దారిను సూచించే సూచనలను ఏర్పాటు చేయడమే కాకుండా ఎల్లప్పుడూ బయటకు వెళ్లే మార్గంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ లోపల వంట వండేందుకు ఎటువంటి వంట పరికరాలు కానీ మంట పరికరాలు కానీ ఉంచరాదని, అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు పాటించే ప్రాంతంలో మాత్రమే ఒక కామన్ కిచెన్ ఏర్పాటు చేసుకుని వంట వండే ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు అధికారులు సూచించారు. సురక్షితంగా లేని మరియు లూస్ గా ఉన్న ప్రమాదకరమైన విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని, ఎగ్జిబిషన్లో ఉన్న వివిధ స్టాల్స్ లో ఉండేవారికి తరచూ అగ్నిమాపక చర్యలు పై మోక్ డ్రిల్ ను నిర్వహిస్తూ ఎటువంటి ప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఎగ్జిబిషన్ నిర్వాహకులకు అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర పాలక సంస్థ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తో పాటు కొత్తపేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# యన్‌సిసి ద్వారా నాయకత్వ లక్షణాల వికాసం

**వార్షిక శిక్షణ శిబిరాన్ని సందర్శించిన కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్**





**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థుల్లో చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో యన్‌సిసి కీలక పాత్ర పోషిస్తుందని కాకినాడ గ్రూప్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ పేర్కొన్నారు. ఉయ్యూరులోని విశ్వశాంతి హై స్కూల్ ప్రాంగణంలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఎనిమిదవ ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ యన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగా యన్‌సిసి కేడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించిన కల్నల్ అగర్వాల్, అనంతరం శిబిరం నిర్వహణ, శిక్షణ విధానాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యన్‌సిసి ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం వంటి విలువలు అలవడతాయని, భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి ఇది బలమైన పునాది వేస్తుందని చెప్పారు. తదుపరి, ఎనిమిదవ ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ యన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ మరియు సిఏటిసి క్యాంపు కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ కే.వి. శ్రీనివాసు మాట్లాడుతూ, మే 1న ప్రారంభమైన ఈ వార్షిక శిక్షణ శిబిరం మే 10న ముగియనున్నట్లు తెలిపారు. శిబిరంలో భాగంగా రేంజ్ ఫైరింగ్, యాంకర్ స్టిమ్యులేషన్, డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, మానసిక మరియు శారీరక వికాసానికి ఆటలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా విద్యార్థుల్లో ఆధ్యాత్మికతతో కూడిన సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ ఫ్లైట్ లెఫ్టినెంట్ సూరజ్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ జాన్సన్, జూనియర్ వారెంట్ ఆఫీసర్లు కేఆర్ సూరజ్, రోషన్ ప్రభాత్, జీసీఐ హారిక, పిఐ స్టాఫ్ సిపిఎల్ అక్కోజం చౌభా సింగ్, సార్జెంట్లు బీస్ట్, కే. గోవిందరావు, కుశ్వాహా, సిపిఎల్ అభిషేక్, రాంబాబు, అలాగే ఎన్సిసి అధికారులు ఐ. శ్రీనివాస్, నీలి రామ్మోహన్, పి. భాస్కరరావు, కె.వి. శ్రీనివాస్, రవి, తిరుపతి రెడ్డి, ఫజులుల్లా తదితరులు పాల్గొన్నారు.

## షేక్ రాజా సాహెబ్ ఆసుపత్రిలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం



**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట షేక్ రాజా సాహెబ్ మినీ జనరల్ ఆసుపత్రిలో సోమవారం ప్రధాన మంత్రి టీ బి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక షేక్ రాజా సాహెబ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ఘంటసాల తిలక్ అనే వ్యక్తి టీబీ మందులు వాడుతున్న పేషంట్లకు పౌష్టికాహారం అందజేయడం జరిగినది. టీబీ మందులు వాడుతున్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి వివరించారు. మరియు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సారమ్మ , జిల్లా టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ ,పి పి ఎమ్ లీలా కుమార్, మరియు కొత్తపేట టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలి



**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని అందించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే సమస్యను వారు ఎలా పరిష్కరిస్తున్నారు వంటి అంశాలు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాన్ని అందించాలని అన్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు మొత్తం 18 ఫిర్యాదులు అందగా అందులో పట్టిన ప్రణాళిక సంబంధించినవి 8, ఎస్టేట్ 1 ఇంజనీరింగ్ 5, రెవెన్యూ విభాగం 3, వి ఏ ఎస్ 1. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్)చంద్రశేఖర్, ఆర్ ఎఫ్ ఓ మల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలకృష్ణ, వి ఏ ఎస్ డి.హరీష్, బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరం లో ఘనంగా ప్రారంభమైన జన గణన కార్యక్రమం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ మరియు చీఫ్ సెన్సెస్ ఆఫీసర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో జన గణన కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైందని కమిషనర్ మరియు చీఫ్ సెన్సెస్ ఆఫీసర్ ధ్యానచంద్ర అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జన గణన దేశ అభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని, సరైన డేటా ఆధారంగా ప్రభుత్వ విధానాలు రూపుదిద్దుకుంటాయని తెలిపారు. అధికారికంగా మే 1, 2026 నుండి మొదలైనప్పటికీ ఎన్యుమరేటర్లు ఇళ్లను ఈ మూడు రోజులు మ్యాప్ చేసుకున్నారని, సోమవారం నుండి ప్రజల నుండి ప్రశ్నోత్తరాల ద్వారా జనగణన ప్రారంభించారని తెలిపారు. నగరంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ, కుటుంబ సభ్యుల వివరాలు, వృత్తి, విద్య, నివాస పరిస్థితులు తదితర సమాచారాన్ని సేకరించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన గణకులు సేకరిస్తారని అన్నారు. ప్రజలు గణకులకు పూర్తి సహకారం అందించి, సరైన సమాచారం ఇవ్వాలని కమిషనర్ విన్నవించారు.

## ఈశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు, మే 4 ( వార్త ప్రభ )**పెనుగంచిప్రోలు గ్రామం లో చెరువు కట్ట బజారులోని దాసరి పల్లెలో, దాసరి కుల సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో శాసనసభ్యులు మరియు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య , గజ్జి కృష్ణమూర్తి , కల్లూరి శ్రీవాణి , దాసరి కుల సంఘ ప్రతినిధులు, అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేటి వివాహ వ్యవస్థలో మార్పులు - సవాళ్లపై నిపుణుల మేధోమథనం

**వివాహ బంధం ఒక సామాజిక బాధ్యత - సైకాలజిస్ట్ డాక్టర్ పల్లవి**

**జగ్గయ్యపేట, మే 4 (వార్తప్రభ)** మారుతున్న సామాజిక పరిస్థితుల్లో వివాహ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు పరిష్కార మార్గాలపై ఆదివారం నిర్వహించిన ప్రత్యేక జూమ్ మీటింగ్ లో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. నిపుణుల పలు కీలక సూచనలు చేశారు. ప్రదాన వక్త పాల్గొన్న డాక్టర్ పల్లవి సైకాలజిస్ట్ మాట్లాడుతూ వివాహ బంధాన్ని కేవలం ఒక ఒప్పందంగా కాకుండా బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. మ్యాట్రిమోనియల్ గ్రూపుల ద్వారా కేవలం సంబంధాలు చూపడమే కాకుండా, కౌన్సెలింగ్ ద్వారా వారిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు.డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ పెళ్లి విషయంలో యువతీ యువకులలో మానసిక ఒత్తిడి పెరిగిందని, అవసరమైన స్థాయి కంటే ఎక్కువ కోరికలు (ఎక్సపెక్టషన్స్ )పెంచుకోవడం వల్ల వివాహాలు ఆలస్యమవుతున్నాయని విశ్లేషించారు. ప్రముఖ అడ్వకేట్ జే శ్రీనివాసరావు పెరుగుతున్న విడాకుల కేసుల గురించి మాట్లాడుతూ, చిన్న చిన్న విభేదాలకు కోర్టుల వరకు వెళ్లడం సరికాదని, సహనం




మరియు అవగాహనతో బంధాలను కాపాడుకోవాలని సూచించారు.కార్యక్రమ నిర్వాహకులు కర్లపాటి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్, సామాజిక వేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ, నేటి తరం పెళ్లిళ్లలో వస్తున్న మార్పులను వివరించారు. సంబంధాల ఎంపికలో తల్లిదండ్రులు కేవలం ఆస్తులకు, జాతకాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోని సరయిన సమయానికి వివాహం చేయాలని సూచించారు. యువతలో పెరుగుతున్న వివాహ విముఖత సామాజికంగా ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. వివాహాన్ని కేవలం ఇద్దరు వ్యక్తుల వ్యక్తిగత విషయంగానో లేదా రెండు కుటుంబాల కలయికగానో మాత్రమే చూడటం సరికాదన్నారు. వివాహాన్ని ఒక సామాజిక బాధ్యత బావించాలని పేర్కొన్నారు. సమాజం అనేది అనేక కుటుంబాల కలయికని ఒక ఆరోగ్యకరమైన వివాహ బంధం ద్వారా ఏర్పడే కుటుంబం సమాజానికి ఒక క్రమశిక్షణ కలిగిన పౌరులను అందిస్తుందని అన్నారు. కుటుంబాలు విచ్ఛిన్నమైతే ఆ ప్రభావం నేరుగా సమాజం మీద పడుతుందన్నారు. సాంస్కృతిక వారసత్వం, ఆర్థిక మరియు సామాజిక భద్రత వివాహం బంధం ద్వారానే సాద్యపడతాయని పేర్కొన్నారు. సమాజంలోని మేధావులు, కుల పెద్దలు మరియు సామాజిక కార్యకర్తలు నేటి యువతకు హితబోధ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న నిపుణులు తల్లిదండ్రుల అంచనాలు, యువతలో పెరిగిన కోరికలు, పర్ఫెక్ట్ మ్యాచ్ కోసం నిరీక్షణ వల్ల కలిగే అనర్థాలు మరియు విడాకుల కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాట్రిమోనియల్ గ్రూప్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## బిజెపి కార్యాలయంలో సంబరాలు.



**మచిలీపట్నం మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక బిజెపి కార్యాలయం నందు సోమవారం జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపులో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాలను కైవసం చేసుకున్న సందర్భంలో బిజెపి పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.జిల్లా ఇన్చార్జి ప్రెసిడెంట్ కునపరెడ్డి శ్రీనివాసరావు, గంటా సతీష్ , కూనపరెడ్డి సిద్ధార్థ, సిద్ధినేని సాయిబాబు, బండారు సోమేశ్వరరావు, గుమ్మడి విజయబాబు, మీడియా కన్వీనర్ విశ్వేశ్వర ప్రసన్న కుమార్, బందరు మండల అధ్యక్షులు సాయికుమార్, తదితరులు పాల్గొని మిఠాయిలు పంపిణీ చేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు, మే 4( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు మండలం, గుమ్మడిదుర్రు గ్రామంలో పట్టదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూఆస్తి అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో వ్యక్తిగత ఫోటోలతో ముద్రించిన పాసుపుస్తకాలు ఇవ్వడం వల్ల అనేక సాంకేతిక, న్యాయ సంబంధిత సమస్యలు తలెత్తాయని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.ప్రత్యేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఫోటోతో ముద్రించిన పుస్తకాల విషయంలో ప్రజల్లో గందరగోళం ఏర్పడిందని, భూమి రికార్డుల విషయంలో స్పష్టత లోపించిందని విమర్శించారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారిక రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తూ, భూ యజమానులకు న్యాయ పరిరక్షణ కల్పిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు తహసీల్దార్ శాంతి లక్ష్మీ , పోలంపల్లి మునీరు ప్రాజెక్టు చైర్మన్ పొన్నం బాలాజీ, పొందూరి నాగేశ్వరరావు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు యార్లగడ్డ విశ్వనాథం, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంచేటి రాంబాబు మరియు రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికల సాధికారతకు దిశానిర్దేశం

**"కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్‌కు శ్రీకారం --గోడపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ**

**మచిలీపట్నం మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కిశోర బాలికలు, బాలుర సాధికారత కోసం వేసవిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కృష్ణా జిల్లాలో కిశోర బాలికలు ,బాలురు సమగ్ర అభివృద్ధి శక్తివంతీకరణ లక్ష్యంగా "కిషోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ 2026" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్. డి. కె. బాలాజీ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన కిషోరి వికాసం గోడపత్రాలను ఆవిష్కరించి, ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కిశోర బాలికల సమగ్ర అభివృద్ధి కోసం ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని సూచించారు.ఈనెల 1 వ తేదీ నుండి జూన్ 11,తేదీ వరకు ప్రత్యేకంగా రూపొందించిన సమ్మర్ క్యాలెండర్ ప్రకారం ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా అమలు చేయబడుతుందన్నారు. ఈ క్యాంపెయిన్ ద్వారా కిశోర బాలికలకు,బాలురకు జీవన నైపుణ్యాలు, స్వీయ అవగాహన, ఆరోగ్య మేళాలు, రక్తహీనత నివారణ, లైంగిక పునరుత్పత్తి ఆరోగ్యం , హెచ్ఐవి/ఎయిడ్స్ అవగాహన, చట్టాలపై జ్ఞానం తో పాటు ( ఫోక్సో, పిసీఎంఎ, డివి, ఆర్ టి ఈ), ఆర్థిక నిర్వహణ, శారీరక వ్యాయామం, విద్య కెరీర్ మార్గదర్శకత్వం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ



అందించబడుతుందన్నారు. అదేవిధంగా సైబర్ భద్రత, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత వంటి ముఖ్య అంశాలపై కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమం అమలులో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు వివిధ లైన్ డిపార్ట్మెంట్స్ సమన్వయంతో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. ఎన్. రాణి ,జిల్లా బాలల సంరక్షణ అధికారి . బి.కిషోర్ , నోడల్ ఆఫీసర్ సుధా రాణి, ఈవో విజయలక్ష్మి చైల్డ్ లైన్ సమన్వయకర్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యానాదులు కాలనీలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ల వితరణ.



**మచిలీపట్నం మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు హైదరాబాద్ సాఫ్ట్వేర్ ఇంజనీర్లు సోమవారం మచిలీపట్నం రైల్వే స్టేషన్ వద్ద గల యానాదులు కాలనీ(దేవుడి తోట )లో 40 వేల రూపాయలు ఖరీదు చేసి బట్టలను వితరణంగా అందజేశారు. ఈ కార్యక్రమం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎల్. ఎస్. ఎస్. వి. డి హనుమంతరావు చేతుల మీదుగా జరిగింది.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న సాఫ్ట్వేర్ ఇంజనీర్లు వర్ధినేడి శ్రీకాంత్, లంకిశెట్టి దీప్తి తమ సంపాదనలో 40,000 తో తమ కుమార్తె ఆశ్రిత పేరు మీద నిరుపేదలైన యానాదులకు బట్టలు అందించడం వారి హృదయ వితరణను తెలియజేస్తుందని అన్నారు. మన సంపాదనలో కొంత శాతం సమాజంలో పేదవారికి అందించవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమం మానవసేవే మాధవసేవ కు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, యువ న్యాయవాది లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు క్యాషిలెస్ చికిత్స

**జగ్గయ్యపేట సిఐ పి వెంకటేశ్వర్లు**



**జగ్గయ్యపేట మే 4 (వార్త ప్రభ )**చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో పీఎం – రహత్ (రోడ్ ప్రమాద బాధితులకు క్యాష్‌లెస్ చికిత్స పథకం) పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఎన్టీఆర్ విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీఎస్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు రూరల్ డిసిపి లక్ష్మీనారాయణ నందిగామ ఏసిపి శ్రీనివాసరావు ఆదేశం మేరకు జగ్గయ్యపేట సిఐ పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయన ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు ప్రమాదాల సమయంలో అత్యవసర చికిత్సను ప్రభుత్వం ద్వారా 1.5 లక్షల వరకు ఉచితంగా (క్యాషిలెస్ ) పొందవచ్చని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ లో చికిత్స అందితే ప్రాణాలను రక్షించవచ్చని తెలియజేశారు.ఈ పథకం ద్వారా ప్రమాద బాధితులకు మొదటి 7 రోజుల పాటు ఉచిత వైద్యం అందుతుంది112 ఎమర్జెన్సీ సేవల ద్వారా వెంటనే సహాయం పొందవచ్చునని,ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో చికిత్స లభిస్తుందని తెలియ చేయడం జరిగింది. మీరు వెంటనే 112 కాల్ చేసి ప్రమాద బాధితులను వెంటనే తెలియపరచగలరని పోలీసు వారి ఉద్దేశం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంల చిల్లకల్లు ఎస్ఐ సాయి మణికంత మరియు పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పాత రికార్డులు మాయం.. దోచిపెట్టడం ఖాయం

**బద్వేల్ టు కృష్ణపట్నం కొత్త హైవే....భూ సేకరణ లో భూచోళ్లు**

**ఆత్మకూరు మే 04 (వార్తప్రభ)**ఏపీలో మరో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి లైన్ క్లియర్ అయ్యింది. కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవేను బద్వేల్ టు కృష్ణపట్నం మధ్య రూ. 3,397.46 కోట్లతో దాదాపు 108 కిలోమీటర్ల పొడువున నిర్మించనున్నారు.ఈ హైవేతో రాయలసీమ నుంచి కృష్ణపట్నం పోర్టుకు కనెక్టవిటీ ఉంటుంది.హైవే పూర్తి చేస్తే బద్వేల్– కృష్ణపట్నం మధ్య దూరం దాదాపు 34 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.. అంటే 142 కి.మీ. నుంచి 108.13 కిలోమీటర్లు అవుతుంది.ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే కడప జిల్లా గోపవరం (ఎన్‌హెచ్–67) నుంచి ప్రారంభమై కృష్ణపట్నం పోర్టు (నేషనల్ హైవే 16)ను కలుపుతుంది.ఇప్పటికే భూ సేకరణ కోసం రూ.255.64 కోట్లు మంజూరు చేశారు.అయితేబద్వేల్–కృష్ణపట్నం(ఎన్‌హెచ్–67) జాతీయ రహదారి కొరకు ఆత్మకూర్ నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో మర్రిపాడు రెవిన్యూ పరిధిలో ప్రభుత్వం సేకరించిన భూములే ఇప్పుడు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ప్రభుత్వ రికార్డుల్లోని లోపాలు అధికారుల నిర్లక్ష్యం పెట్టుబడిగా భూ ఆక్రమణ దారులు జాతీయ రహదారి వెళ్లే మార్గాన్ని గుర్తించి అక్కడ ఉండే ప్రభుత్వ పొలాల్లో తమ పేర్లను ఆన్లైన్లో ఎక్కించి టెన్ వన్ మాన్యువల్ అడంగల్ ను మాయం చేసి అసలు పట్టాదారులను బురిడీ కొట్టిస్తున్నారు.ఆన్లైన్ ముసుగులో అక్రమార్కులు సామాన్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లక్షల రూపాయల దోపిడికి



తెరలేపారు. బద్వేల్ –కృష్ణపట్నం జాతీయ రహదారి 67 నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాత రికార్డులు మాయంచేసి రెవిన్యూ కళ్ళు గప్పి లక్షలు దోచిపెట్టడానికి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ద్వారా జెన్యూన్ సర్టిఫికెట్ పొందడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నట్లు బహిరంగ రహస్యంగా గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. అయితే సమర్థ అధికారిగా పేరు తెచ్చుకొని మర్రిపాడు మండలంలో సామరస్య పాలన సాగిస్తున్న మండల తాసిల్దార్ భూచోరుల బాగోతం బయట పెడతారో లేదో వేచి చూడాలి.

## కృష్ణాజిల్లాలో ఆక్వా చెరువులపై రైతుల ఆగ్రహం.

**వ్యవసాయ భూములే ముద్దు.. ఆక్వా చెరువులు వద్దు అంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా.**



**మచిలీపట్నం మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లాలో వ్యవసాయ భూములను ఆక్వా చెరువులుగా మార్చుతున్న చర్యలపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద పలు గ్రామాల రైతులు భారీగా తరలి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. "ఆక్వా చెరువులు వద్దు.. వ్యవసాయ భూములే ముద్దు" అంటూ నినాదాలు చేస్తూ ఆక్వా రైతులకు వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, పంట భూములను చెరువులుగా మార్చడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతాయని, భవిష్యత్ తరాలకు ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆక్వా చెరువుల వల్ల నేల ఉప్పుదనం పెరిగి, పంటల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ఇటీవల అనుమతులు లేకుండా కొన్ని ప్రాంతాల్లో చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వెంటనే వాటిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని కాపాడాలని, రైతుల జీవనాధారాన్ని రక్షించాలని అధికారులను కోరారు.

రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రమ ఆక్వా చెరువులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో మంత్రి కొల్లు రవీంద్ర.





**మోపిదేవి:అవనిగడ్డ:మే4(వార్తాప్రభప్రతినిధి)**మోపిదేవిలో కొలువుతీరిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు.ఆలయానికి వచ్చిన మంత్రి రవీంద్రకు డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో రవీంద్ర పాలుపోసి, మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఆయన శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ పండితులు ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంత్రి కొల్లు రవీంద్రను దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో సత్కరించి, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అలాగే అభివృద్ధి పనులపై దాసరి శ్రీరామ వరప్రసాదరావును మంత్రి రవీంద్ర అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ముప్పిరి శెట్టి హరినాథ్,ఎస్సై పామర్తి గౌతమ్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు, జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు కొల్లి మురళి, మండల తెలుగు యువత అధ్యక్షులు విస్సంశెట్టి రాజా, పిఎసిఎస్ చైర్మన్ బళ్లా సీతారామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**స్వామి వారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు.** శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.వీరికి ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.తొలుత నాగ పుట్టలో పాలు పోసి మొక్కు బడులు చెల్లించుకున్న అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.అనంతరం స్వామి వారి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలు అందించారు.

## ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ను కలిసిన చిన్నా జనసేన

**ఆత్మకూరు మే 04 (వార్తాప్రభ)** మర్రిపాడుకు చెందిన చిన్న అనే వ్యక్తి జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన పార్టీలో సురుకైన వ్యక్తిగా కొనసాగుతున్నారు. అధిష్టానం ఆదేశించిన ఎన్నో కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తున్న విషయం మరిపాడు మండలమే కాదు జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.జనసేన పార్టీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ను హైదరాబాదు లోని ఆయన నివాసములో చిన్న మర్యాద పూర్వకంగా కలిశారు.పార్టీ కార్యక్రమాలను ఆయన దృష్టిలో ఉంచారు.ఎమ్మెల్సీ నాగబాబు చిన్న జనసేనను మండలంలోని పార్టీ ప్రస్తుత పరిస్థితి పై ఆరా తీశారు.అలాగే పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అయన చిన్నా జనసేనకి పలు సూచనలు చేశారు.రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కార్యకర్తలను చురుకుగా పనిచేయించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించు కోవాలని తెలిపారు.ముఖ్యంగా యువతకు మహిళలకు రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీని మరింత బలమైన శక్తిగా నిలబెట్టేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.



## అమరజీవి దాచూరి రామిరెడ్డికి ఘన నివాళులు



**గిద్దలూరు, మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గిద్దలూరు పట్టణంలోని యూటిఎఫ్ కార్యాలయంలో అమరజీవి దాచూరి రామిరెడ్డి వర్ధంతి వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి. పిచ్చయ్య అధ్యక్షత వహించి ప్రారంభ ఉపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ నాయకులు రవీంద్రారెడ్డి అమరజీవి దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు తోట కృష్ణయ్య తదితరులు దాచూరి రామిరెడ్డి యూటీఎఫ్ సంఘ పతిష్టతకు, డైరీ ,అధ్యాపక దర్శినిలో ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి మాధవి దేవి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య,ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, గిద్దలూరు, రాచర్ల ,కొమరోలు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, బాల వెంకటేశ్వర్లు,రఘురాం,రంగారెడ్డి, వెంకటేశ్వర్లు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు జయ చంద్రారెడ్డి,మహానంది రెడ్డి,రంగ నాయకులు, వెంకటేశ్వరరెడ్డి, ఈ.వెంకటేశ్వర్లు, నాగరాజు ,మూడు మండలాల బాధ్యులు, సభ్యులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## రోడ్ ప్రమాద బాధితులకు క్యాష్‌లెస్ చికిత్స పథకం పై అవగహన కార్యక్రమం



**జగ్గయ్యపేట మే 4 (వార్త ప్రభ )** పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో పీఎం – రహత్ (రోడ్ ప్రమాద బాధితులకు క్యాష్ లెస్ చికిత్స పథకం) పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు ప్రమాదాల సమయంలో అత్యవసర చికిత్సను ప్రభుత్వం ద్వారా 1.5 లక్షల వరకు ఉచితంగా (కాష్ లెస్ ) పొందవచ్చని వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్ లో చికిత్స అందితే ప్రాణాలను రక్షించవచ్చని తెలియజేశారు.ఈ పథకం ద్వారా:ప్రమాద బాధితులకు మొదటి 7 రోజుల పాటు ఉచిత వైద్యం అందుతుంది.112 ఎమర్జెన్సీ సేవల ద్వారా వెంటనే సహాయం పొందవచ్చునని,ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో చికిత్స లభిస్తుందని తెలియ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వీరాంజనేయస్వామి వారి దేవాలయంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**ఇబ్రహీంపట్నం,మే 04(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లిలో కొలువుదీరిన భక్తుల కొంగు బంగారమైన శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానము నందు దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ మహోత్సవ వేడుకల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం పాల్గొన్నారు. ఆలయంలో దేవతా మూర్తులను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వినియోగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనురాధా నక్షత్రయుక్త వృషభ లగ్నంలో ప్రతిష్టా మహోత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. శ్రీ వీరాంజనేయ స్వామి వారి మహా సంప్రోక్షణ, ఆదిత్యాది నవగ్రహ పునః ప్రతిష్ట మరియు నాగరాజు, గణేశుల నూతన విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ విజయం తో సంగం లో ఘనంగా సంబరాలు



**సంగం ఏప్రిల్ 04(వార్తాప్రభ ప్రతినిధి)** ఐదు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ మూడు రాష్ట్రాల్లో ఘన విజయం సాధించడంతో సంగంలో సంబరాలు మిన్నంటాయి. సంగం బస్ స్టాండ్ సెంటర్‌లో కూటమి నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు కర్నాటి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకుంటూ విజయోత్సాహాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కర్నాటి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్లో కొనసాగుతున్న పాలనకు ప్రజలు ముగింపు పలుకుతూ భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలు ఎన్డీఏకు విజయాన్ని అందించారని అన్నారు. రాబోయే 2029 ఎన్నికల్లో నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఎన్డీఏ మరింత బలంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాతపాడులో నేడు వన్ మంత్- వన్ విలేజ్ - ఫోర్ విజిట్ కార్యక్రమం

### ప్రజలు మీ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చు... తహాశీల్దారు ఆర్ మస్తానయ్య



**చేజర్ల మే 04 (వార్తాప్రభ)** శ్రీయుత కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి ఆదేశాల మేరకు గ్రామాలలో నెలకొన్న రెవెన్యూ మరియు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యల పట్ల ప్రజలు శాశ్వత పరిష్కారం అందుకునే విధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల చేజర్ల మండలంలో పాతపాడు గ్రామంలో ద్వితీయంగా మే 2026 మాసంలో ప్రతి మంగళవారం ఈ నెల 5వ 12వ 19వ మరియు 26వ తేదీ వరకు వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దారు ఆర్ మస్తానయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నేడు పాతపాడులో నిర్వహించే ఈ సభలో అధికారులు అందరూ పాల్గొంటారని ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించి మీ సమస్యలకు శాశ్వత పరిష్కారం మార్గాన్ని పొందాలని ప్రజలకు అలాగే రైతులకు ఆ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని వారు తెలిపారు.

## అగ్ని మాపక అధికారి గా కృపావరం



**కాకినాడ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ జిల్లా అగ్ని మాపక అధికారిగా సిహెచ్ .కృపావరం నియమితులయ్యారు. ఈయన విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ నందు అగ్నిమాపక అధికారిగా పనిచేస్తు బదిలీపై కాకినాడ కు బదిలీపై వచ్చిన ఈయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ లను మర్యాదపూర్వకంగా కలిశారు.

# తమిళనాడు ప్రజా తీర్పు మాదిరిగానే 2029 ఎన్నికల ఫలితాలు ఉంటాయి

### వైయస్సార్సీపీ మైనార్టీ నేత షేక్ హుస్సేన్ బాషి ధీమా వ్యక్తం



**విజయవాడ పశ్చిమ మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సోమవారం వించి పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో బాషీ మాట్లాడుతూ తమిళనాడులో ఎన్నికల ఫలితాలలో టీ వీ కే పార్టీ బంపర్ మెజారిటీతో గెలవడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికార పార్టీ తోపాటు కూటమిపార్టీ వరకు పన్నిన కుట్రలను ఛేదించడమే కాకుండా ఒంటరిగా పోటీ చేసిన తొలిసారే అధికార పగ్గాలు చేజిక్కించుకున్న టీవీ కే వ్యవస్థాపక అధ్యక్షులు విజయ్ కు వైయస్సార్సీపి తరపున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. తమ అధినేత జగన్ మోహన్ రెడ్డి మాదిరిగా సింహం సింగిల్ గానే వస్తుందన్న నానుడిని నిజం చేస్తూ సింగిల్ పార్టీగా ఎన్నికల్లో పోటీ చేసి దళపతి విజయ్ ముఖ్యమంత్రి కావడం పట్ల వైయస్సార్సీపీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. 2029 ఎన్నికలలో మరోసారి వైయస్సార్సీపి సింగిల్ గా పోటీ చేసి తమ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి ని రెండో సారి ముఖ్యమంత్రి చేసి తీరుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ శ్రేణులు 2029 ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారంటూ షేక్ హుస్సేన్ బాషా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కాషాయం దేశ గౌరవం!!

● కమలం దేశ ప్రతిష్ట ● బిజేపీ జెండా ప్రజల అజెండా ● మోదీ నాయకత్వం భారత్ రక్షణ, ప్రజల సంక్షేమం ● 3 రాష్ట్రాల్లో అఖండ మెజారిటీతో కమలం వికాసం ● బాణాసంచా, మిఠాయిలతో కార్యకర్తల సంబరాలు ● గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో హర్షధ్వానాలు ● బిజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి





**పెద్దపల్లి/గోదావరిఖని: మే 4 (వార్తాప్రభ ప్రతినిధి)** కాషాయం దేశ గౌరవానికి ప్రతీకగా, కమలం దేశ ప్రతిష్టకు నిదర్శనంగా నిలుస్తుందని, బీజేపీ జెండా ప్రజల అజెండాగా మారిందని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి ఉత్సాహభరితంగా హర్షం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వం భారత్ రక్షణకు, ప్రజల సంక్షేమానికి దిశానిర్దేశం చేస్తోందని ఆమె కొనియాడారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో అఖండ మెజారిటీ సాధించిన నేపథ్యంలో సోమవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తా సంబరాలతో కళకళలాడింది. బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకుని బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మిఠాయిలు పంచిపెట్టి విజయోత్సవాన్ని ప్రజలతో పంచుకున్నారు. పార్టీ జెండాలు ఎగురవేస్తూ దేశభక్తి నినాదాలతో ప్రాంతం మార్మోగింది. కార్యకర్తల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు మరింత ఊపునిచ్చారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ, ఈ విజయాన్ని ప్రజల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తున్నామని నాయకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో మరింత సేవాభావంతో పని చేస్తామని హామీ ఇచ్చారు. దేశ అభివృద్ధి పథంలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. సాధించిన విజయాన్ని ప్రజలకే అంకితం చేస్తున్నామని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయోత్సవం స్థానికంగా రాజకీయ చైతన్యాన్ని పెంచింది. ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అనే ద్వంద లక్ష్యాలతో బీజేపీ ముందుకు సాగుతుందని చెప్పారు. నాయకత్వంపై ప్రజల నమ్మకం మరింత బలపడిందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సంబరాలు ప్రాంతంలో ఉత్సాహాన్ని నింపాయి. ప్రజలు కూడా నాయకులతో కలిసి విజయాన్ని ఆనందంగా జరుపుకున్నారు. మొత్తంగా గోదావరిఖని కేంద్రంగా విజయోత్సవం ఘనంగా జరిగింది.

# మాధవరం సీఎం సభకు సర్వం

**విస్సన్నపేట మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు 9వ తేదీన నూరు శాతం సర్వే పూర్తిచేసిన మాధవరం గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు తిరువూరు నియోజకవర్గ పరిధిలో హాజరయ్యే కార్యకర్తలకు కూటమి పార్టీల సానుభూతిపరులకు సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ ఎస్ దేవదత్ తెలియజేశారు. బహిరంగ సభ,కార్యకర్తలతో సమావేశం, వీటితోపాటు నియోజకవర్గ పరిధిలో ప్రజల అవసరాలను తెలియజేసేందుకు సర్వసిద్ధంగా ఉండాలన్నారు. కట్లేరు వంతెన, పిట్లవారిగూడెం ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై మరి ఒకసారి విజ్ఞప్తి చేద్దామని చెప్పారు. ఈ కార్యక్రమంను గ్రామాల వారీగా వెళ్లేందుకు ఎంత ఉత్సాహం చూపిస్తున్నారు అదేవిధంగా ఎండలు ఎక్కువగా ఉన్న ఈ సమయంలో సరఫరకు సిద్ధంగా ఉన్న మజ్జిగ ప్యాకెట్లు వాటర్ ప్యాకెట్లు ఉప ఆహారాలు వారందరికీ అందే విధంగా ప్రతి కార్యకర్త ప్రతి నాయకుడు పర్యవేక్షిస్తూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దే), మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు మట్ట వేణుగోపాలరావు, ఆర్బీఎస్ జాతీయ అధ్యక్షులు గో టేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా నాయకులు శ్రీనివాసరావు నెక్కలపు(



డాబా శీను) రాధ ఆకుల, కే రాజా, తుమ్మలపల్లి అనిల్, రంగారావు,జిల్లా నాయకురాలు నాగమణి నాదెండ్ల, తెలుగు మహిళా మండలాధ్యక్షురాలు సంబారు నాగలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షులు విస్సన్నపేట కొంగల శ్రీను, పుట్రేల అరిగే శ్రీనివాసరావు,తాత కుంట్ల పులపాక శ్రీనివాసరావు, వాసు బాబు నందమూరి శ్రీరామచంద్ర, వీరమాచినేని కృష్ణ ప్రసాద్, సాంబశివరావు వంశీ రాయల రాజా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవికతను ప్రతిబింబించేలా ప్రగతి నివేదికలు

**- జిల్లా, నియోజకవర్గాలకు సంబంధించి రూపొందించండి - స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనికత లక్ష్యాల పురోగతినీ పొందుపరచాలి- గౌరవ సీఎం పర్యటన సన్నద్ధతా సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ, మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల 9వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎ.కొండూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాతో పాటు నియోజకవర్గ ప్రగతి నివేదికలను పూర్తిస్థాయిలో వాస్తవికతను ప్రతిబింబించేలా రూపొందించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో ప్లానింగ్, రెవెన్యూ, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులతో సన్నద్ధతా సమావేశం నిర్వహించారు. స్పష్టమైన ప్రణాళిక ప్రకారం చేయాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనిక పత్రానికి అనుగుణంగా జిల్లాలో లక్ష్యాల సాధనకు తీసుకున్న చర్యలు, సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రగతి అంచనాలతో సమగ్ర నివేదికలను రూపొందించాలని సూచించారు. 15 శాతం వార్షిక అభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న చర్యలు, సత్ఫలితాల గణాంకాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధి, జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ), తలసరి ఆదాయం (పీసీఐ) వృద్ధి గణాంకాలతో ఇన్ఫో గ్రాఫిక్స్‌ను రూపొందించాలని సూచించారు. అదేవిధంగా తిరువూరు నియోజకవర్గానికి సంబంధించి నియోజకవర్గ దార్శనిక ప్రణాళికల లక్ష్యాలు, ప్రగతితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి చోదక శక్తులైన జీరో బడ్జెట్ ఆర్గానిక్ ఫార్మింగ్ వంటివాటిపైనా దృష్టిసారించాలని సూచించారు. ఎ.కొండూరుకు కృష్ణా జలాల సరఫరా ప్రాజెక్టుతో పాటు జల్ జీవన్ మిషన్ కార్యక్రమం అమలుతీరును వివరించేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రీసర్వేతోపాటు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రయోజనాలను వివరించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గౌరవ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సమావేశంలో స్టాటిస్టికల్ అధికారి డీవీఎస్ఆర్ ప్రసాద్, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వే, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాడిన బిర్యానీ... ఉడకని చికెన్

### ఇబ్రహీంపట్నం ఆల్ఫాఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాకం - నిర్వాహకుల నిర్లక్ష్యపు సమాధానం.. పార్శిల్ ను హోటల్ ముందు పడేసిన బాధితుడు




**ఇబ్రహీంపట్నం, మే 3 (వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక ఆల్ఫా హోటల్ నిర్వాహకుల తీరు మారడం లేదు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూనే ఉన్నారు. ఒక బాధితుడికి మాడిన బిర్యాని, ఉడకని పచ్చి చికెన్ అంటగట్టారు. బాధితులు చెప్పిన వివరాల మేరకు కొండపల్లి కి చెందిన ఓ యువకుడు ఇబ్రహీంపట్నం ఆల్ఫా హోటల్ లో ఆదివారం మధ్యాహ్నం తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లి పార్శిల్ తెరిచి చూడగా రైస్ మాడు వాసన రావడం గమనించారు. తింటున్న సమయంలో చికెన్ కూడా ఉడక కుండా పచ్చి వాసన రావడంతో తిరిగి ఆల్ఫా ఫ్యామిలీ రెస్టారెంట్ కు వచ్చి యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. నిర్వాహకులు నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వటంతో పార్శిల్ ను హోటల్ ముందే పడేసి వెళ్లిపోయాడు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న ఆల్ఫాఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యా దు చేస్తానని తెలిపాడు. గతంలో కూడా ఆల్ఫా హోటల్ పై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటళ్లలో తనిఖీలు నిర్వహించి కల్తీ ఆహార పదార్థాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టండి

**- సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలి**
**- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 98 అర్జీలు**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని, ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ.. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 98 అర్జీలు రాగా.. వీటిలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి 29 అర్జీలు, రెవెన్యూకు సంబంధించి 21 అర్జీలు, పోలీసు శాఖకు 12, పంచాయతీరాజ్‌కు 9 అర్జీలు వచ్చాయి. డీఆర్‌డీఏకు 8, పౌర సరఫరాలు, ఏపీఎస్ ఆర్‌టీసీలకు మూడు చొప్పున, విద్య, విద్యుత్ శాఖలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, రవాణా, బీసీ సంక్షేమం, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ, కార్మిక, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఆర్ అండ్ బీ శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాస్థాయి అధికారులు నిర్దేశ గడువులోగా అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని, అర్జీదారులకు సకాలంలో సమాచారం అందిస్తూ పారదర్శకత పాటించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జనగణన పరిశీలన...



**గుడ్లవల్లేరు:మే 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని కౌతవరం గ్రామంలో జనగణన చేస్తునటువంటి ఎన్యూమరేటర్స్ సిబ్బందిని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ సోమవారం కలిసి ఆ కార్యక్రమాన్ని పరిశీలించారు. జనగణనకు సంబంధించి చేసేటువంటి విధానాన్ని వారికి వివరించి తగు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం వారికీ సెన్సస్ కిట్లను మరియు ఐడెంటిటీ కార్డులను అందజేశారు.

## గ్రామ అభివృద్ధి కి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకం

### సర్పంచ్ మందుల నాగయ్య

**కోదాడ,మే 4(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలము లోని గుడిబండ గ్రామ పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను సోమవారం గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో కీలకమని, ఈ పథకం ద్వారా గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అలాగే పనులు నాణ్యతతో, పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# ఉచిత హోమియోపతి వెల్‌నెస్ కిట్స్ పంపిణీ



**గుడివాడ,మే 4 (వార్తాప్రభ) :** సోమవారం స్థానిక 19వ వార్డులో దివ్య వాకర్స్ క్లబ్ మరియు ది గుడివాడ మహిళా వాకర్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రాంతీయ హోమియోపతి పరిశోధన సంస్థ, గుడివాడ వారి చే రూపొందించబడిన హోమియో వెల్నెస్ కిట్‌ను ఉచితంగా పంపిణీ వైద్యుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడతూ హోమియోపతిక్ వెల్నెస్ కిట్‌లు అనేవి అజీర్ణం, జలుబు, గాయాలు మరియు చర్మ సమస్యల వంటి సాధారణ, రోజువారీ అనారోగ్యాలకు చికిత్స చేయడానికి రూపొందించబడిన ఔషధాల సమాహాలు అని తెలియజేశారు. ముఖ్యంగా సాధారణ ఆరోగ్యం మరియు జీవశక్తి దృష్టి సారించింద న్నారు. ఈ క్రమంలో 22 సాధారణ అనారోగ్యాలకు 25 నివారణలను కలిగి ఉంటుందనీ పేర్కొనారు. ఈ కార్యక్రమంలో దివ్య వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం లక్ష్మీకుమారి, సెక్రటరీ ఎం దివ్యశ్రీ, ట్రెజరర్ ఎస్ విజయశాంతి అలాగే గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. దీవెన, సెక్రటరీ వి ప్రతిమ, ట్రెజరర్ కృష్ణకుమారి మరియు 19వ వార్డు ఇన్ఛార్జి రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత చల్లని మజ్జిగ పంపిణీ అభినందనీయం



**గుడివాడ,మే 4 (వార్తాప్రభ) :** దివ్య వాకర్స్ క్లబ్ మరియు ది గుడివాడ మహిళా వాకర్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో గుడివాడ –కెటిఆర్ కాలేజి రోడ్‌లో ఉచిత మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వేసవిలో తాగునీరు, మజ్జిగ అందించడం పుణ్యకార్యమని పేర్కొన్నారు. పట్టణ పరిసర గ్రామాల ప్రజలు గుడివాడ కు ఎంతో మంది ప్రజలు వివిధ పనులపై వస్తుంటారనీ ప్రస్తుత వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, వేడి గాలులు ఎక్కువగా వీయడంతో సామాన్య ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా మజ్జిగ అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దివ్య వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం లక్ష్మీకుమారి, సెక్రటరీ ఎం దివ్యశ్రీ, ట్రెజరర్ ఎస్ విజయశాంతి అలాగే గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం. దీవెన, సెక్రటరీ వి ప్రతిమ, ట్రెజరర్ కృష్ణకుమారి మరియు 19వ వార్డు ఇన్ఛార్జి రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కారుమూరి కి బి.సి.నేత పి.ఎల్.పి. నేతృత్వంలో ఆత్మీయ సత్కారం



**మార్కాపురం,మే 4 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి, యాదవ శ్రేయోభిలాషి కారుమూరి నాగేశ్వరరావు యాదవ్ సోమవారం మార్కాపురంలో జరిగినటువంటి వైఎస్ఆర్‌పిపి కార్యక్రమానికి హాజరయ్యారు. పార్టీ ప్రకాశం జిల్లా ఇన్చార్జిగా ఉన్నటువంటి వారు వచ్చిన శుభ సందర్భంగా రాష్ట్ర బి.సి.నాయకులు పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ నాయకత్వంలో స్థానిక యాదవ నాయకులు బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, కడెం వెంకటేశ్వర్లు యాదవ్, బోరి గొర్ల అజయ్ యాదవ్ తదితరులు శాలువతో సత్కరించి, గజమాలతో అభినందించారు

# కొప్పాకుల శ్రీను కుమారుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**నందిగామ,మే 4 (వార్తాప్రభ) :** స్థానిక 11వ వార్డు ఇన్చార్జి,పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు కొప్పాకుల శ్రీనివాసరావు కుమారుడిని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోమవారం పరామర్శించారు. కొప్పాకుల శ్రీనివాసరావు కుమారుడు ప్రణీత్ చెన్నైలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై కాలు శస్త్ర చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకొనుచుండగా కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రణీత్ ను వారి స్వగృహంలో కలుసుకుని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఏచూరి రాము పార్టీ నాయకులు పంగా సతీష్, కె శ్రీనివాసచారి, దుగ్గిదేవి గోపికృష్ణలు పాల్గొన్నారు.



ది 4.5.2026 శాఖ గ్రంథాలయం రాజేంద్రనగర్ నందు సమ్మర్ క్యాంప్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులను జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు అడగడం జరిగినది. ఈ కార్యక్రమంలో జి. చిరంజీవి, గ్రంథాలయ నిర్వాహకురాలు పి శాంతి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.
–గుడివాడ,మే 4 (వార్తాప్రభ) :

# వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో గుడివాడలో పలు చోట్ల మజ్జిగ పంపిణీ

● ఫ్రూట్స్ యూత్ ఆధ్వర్యంలో.. తారకరామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో..







**గుడివాడ,మే 4 (వార్తాప్రభ) :** ఎండలు మండిపోతున్న వేళ గుడివాడలో కూటమి నాయకులు ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చారు. రైతు బజార్ సెంటర్‌లో వేసవి చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. స్థానిక రైతు బజార్ వద్ద పెద్ది చిన్నారావు జ్ఞాపకార్థం ఫ్రూట్స్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలుత గుడివాడ పట్టణ టీడీపీ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, పండ్లవర్తక సంఘం అధ్యక్షుడు గోకరకొండ బలరాం, జనసేన రాష్ట్ర నాయకులు సందు పవన్ లు స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చలివేంద్రాన్ని ప్రారంభించారు. నిత్యం వేలాది మంది రద్దీగా ఉండే రైతు బజార్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కూటమి నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేయడంలో కూటమి శ్రేణులు ఎప్పుడూ ముందుంటాయని, కిషోర్ సేవాస్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పందిళ్ళ మల్లి, కోయిలాపు రాము, యూత్ నాయకుడు శివాల దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు నైనాల చిన్న, వంగపండు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**తారకరామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. :** స్థానిక బి.ఎస్.ఎన్.ఎల్ ఆఫీస్ వద్ద తారకరామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు బచ్చు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వాకర్స్ జిల్లా 204 మాజీ గవర్నర్ సనకా సుబ్బారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. క్లబ్ కార్యదర్శి గరికపాటి సాంబశివరావు కుమార్తె అప్పికట్ల జయ నాగ వెంకట లక్ష్మి కనకదుర్గ 43వ పుట్టినరోజును పురస్కరించుకుని, వారి ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొలబత్తుల రామకృష్ణ, మెరుగు మాల బ్రహ్మయ్య, జి. శ్రీనివాస్, సయ్యద్ మహబూబ్ అలీ, సముద్రాల వెంకటేశ్వరరావు, ఎస్.కె. సుభాని, తమ్మినేని రామమోహనరావు, మరదాని వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సుధారాణి, వీరమాచినేని శైలజ, చల్లా ఈశ్వరి, జొన్నలగడ్డ రామలక్ష్మి, నెరుసు సుభాష్ చంద్రబోస్, చదివాది వెంకట మోహన్ రావు, సామి రామ మోహన్ రావు, సి.హెచ్. సుబ్రహ్మణ్యం, కాడిచర్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి వారి ఆధ్వర్యంలో.. :** సోమవారం లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో 14వ రోజు ఉచిత మజ్జిగ ఉచిత కూలింగ్ వాటర్ ప్రగతి సభ్యులు ఉరిటి రామారావు వితరణతో వారి కీర్తిశేషులు ఉరిటి లక్ష్మీ మోహన్ రావు సోదరుడు ఉరిటి రాంకుమార్ జ్ఞాపకార్థం ఈరోజు ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ లో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం మరియు కూలింగ్ వాటర్ చలివేంద్రం ప్రారంభించడం జరిగినది ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దు వీరభద్రరావు ప్రగతి అధ్యక్షులు మాదల సురేష్ సెక్రెటరీ పామర్తి కేశవరావు గవర్నర్ ఏరియా రిప్రజెంట్ రామదేని వేణుబాబు జిల్లా డిస్టిక్ ఎడిషనల్ ట్రెజరర్ ఉపద్రష్ట రాంబాబు, పూర్వాధ్యక్షులు బొప్పన కోటేశ్వరావు మల్లంపల్లి వెంకటరావు, సనక సుబ్బారావు, పి. నాంచారయ్య, కట్ట రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మానవతా సేవాసంస్థ సభ్యుల సేవలు అభినందనీయం





**గుడివాడ,మే 4 (వార్తాప్రభ) :** సోమవారం ఉదయం ఉమ్మడి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, శ్రీలక్ష్మి దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా అలాగే శ్రీలక్ష్మి పుట్టినరోజు సందర్భాలను పురస్కరించుకొని స్థానిక రైల్వే స్టేషన్లో 1000 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీరశేషగిరిరావు గుడివాడ మానవతా సంస్థలో అధ్యక్షుడుగా మరియు క్రిష్ణాజిల్లా అధ్యక్షునిగా, బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం ఉమ్మడి క్రిష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ గా చేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ దంపతులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మానవతాసంస్థ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి దంపతులు, పెద్దలు బొగ్గవరపు తిరుపతయ్య, కోశాధికారి బచ్చు రాధాకృష్ణ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, కన్వీనర్ మరియు ఉమ్మడి క్రిష్ణాజిల్లా విద్యానిధి డైరెక్టర్ ఉప్పలపాటి మారుతీప్రసాద్,కార్యదర్శి నందమూరి పద్మజ, డైరెక్టర్ గుత్తా నళిని దంపతులు,డైరెక్టర్ పిన్నమనేని రామచంద్రరావు,ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ చలువాది మోహనరావు, కార్యవర్గసభ్యులు సామి రామమోహనరావు, ఘంటా చంద్రశేఖరరావు, మానవతాసభ్యులు ఆలీ, కంఠమనేని పావనీప్రసాద్, గుళ్ళపల్లి శైలజ, వీరమాచనేని శైలజ, సునీత, పూర్ణేందిర, యార్లగడ్డ సుధారాణి, బ్రహ్మయ్య, తిరుమల గుప్తా, మోహనరావు, సాంబశివరావు లు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

**మానవతా సభ్యులు పి. వెంకటరావులచే అన్నదాన కార్యక్రమం.. :** స్థానిక ఎ.జి.కె హైస్కూల్ ప్రక్కన గల అన్నా క్యాంటీన్ నందు మానవతా సభ్యులు పి. వెంకటరావు 200 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారి మనుమడు గౌతమ్ అయీంద్ర పుట్టినరోజు సందర్భంగా.. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల సమక్షంలో పుట్టినరోజు జరుపుకుని వారికి భోజనాలు పెట్టడం ఆనందదాయకమని, గుడివాడ మానవతాశాఖ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి దంపతులు, బాబు తాతగారు వెంకటరావు, గుడివాడ మానవతాశాఖ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాల రావులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బచ్చు రాధాకృష్ణ, కార్యదర్శి నందమూరి పద్మజ, అన్నదాత కుటుంబీకులు, సభ్యులు పూర్ణేందిర, వీరమాచనేని శైలజ, సునీత, బ్రహ్మయ్య, డైరెక్టర్ పిన్నమనేని రామచంద్రరావు, కార్యవర్గ సభ్యులు సామి రామమోహనరావు, సభ్యులు బొగ్గవరపు తిరుపతయ్య, ఆలీ లు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా ఫలితాలలో హనుమాన్ జంక్షన్ నారాయణ విద్యార్థులు





**హనుమాన్ జంక్షన్,మే 4 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పదవ తరగతి 2026 పబ్లిక్ పరీక్షలలో హనుమాన్ జంక్షన్ నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణతతో పాస్ అయి ఆంధ్రప్రదేశ్ లో ఏడవ రాంక్ సాధించడమే కాకుండా హనుమాన్ జంక్షన్ టౌన్ లో టౌన్ ఫస్ట్ గా మరియు పాఠశాలలో మొదటి స్థానంలో షేక్ మొహమ్మద్ షాకిబ్ 593 మార్కులతో విజయదుంధిబి మ్రోగించారు. అంతే కాకుండా గరికిపాటి సాయి లిఖిల్ 588 మార్కులతో రెండవ స్థానంలో నిలవగా, గాదె హరి,శ్రీ ధన లక్ష్మి 586 మార్కులతో మూడవ స్థానంలో, చిలకలపూడి జాహ్నవి 582 మార్కులతో నాల్గవ స్థానంలో,బూరి చాందిని 581 మార్కులతో ఐదవ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్య సంస్థల కోర్ కమిటీ మెంబెర్ రమా నారాయణ,డైరెక్టర్ సింధు నారాయణ ఆంధ్రప్రదేశ్ లో ఏడవ రాంక్ సాధించడమే కాకుండా హనుమాన్ జంక్షన్ టౌన్ లో 593 మార్కులతో టౌన్ ఫస్ట్ గా నిలిచిన షేక్ మొహమ్మద్ షాకిబ్ ను గోల్డ్ మెడల్ మరియు పుష్పగుచ్చముతో అభినందించారు. నారాయణ విద్య సంస్థల ఏ.జి.యం. దాసరి.సత్తి రెడ్డి విద్యార్థిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చముతో అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇంతటి విజయాన్ని సాధించిన తమ పాఠశాల విద్యార్థి ని హనుమాన్ జంక్షన్ స్టేట్ హైవే గుండా బాణాసంచా తో ఊరేగించారు. 593 మార్కులు సాధించిన తమ విద్యార్థి షేక్ మొహమ్మద్ షాకిబ్ పాఠశాల పారంభించిన మొదటి నుండి నేటి వరకు ఎంతో చక్కగా క్రమశిక్షణతో చదువుకొని పాఠశాల పేరుప్రఖ్యాతలు తేవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలియచేసారు అంతేకాకుండా తమ పాఠశాలలో 51 మంది విద్యార్థులు ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలకు హాజరు కాగా వారిలో 18 మంది విద్యార్థులకు 550 కి పైగా మార్కులు,అంతేకాకుండా 37 మంది విద్యార్థులకు 500 పైబడి మార్కులు సాధించారని అలాగే ప్రతి సబ్జెక్టులో నూరుశాతం మార్కులు అనేకమందికి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఈ టెక్నో అకాడమిక్ డీన్ తాడేపల్లి ఆషాలత, పదవ తరగతి ఇంచార్జి గురజాల గాంధీ,ఉపాధ్యాయులు తానంకి శ్రీదేవి ,మేకా శ్రీధర్,తూటా మౌనిక , నడిపల్లి కృష్ణ ,కోమట్లపల్లి ఉదయశ్రీ, అడపా మంజులత, చెన్నంశెట్టి వాణి శ్రీ లత,పొలిమెట్ల శశికల,కండవల్లి అనూహ్య ,కసుకుర్తి సుమ,ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ కొంగర్ల లలిత భవాని ఈ.కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ , ఫిసికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాపు సంక్షేమ భవన నిర్మాణం చేపట్టాలని వినతి



**కోడూరు,మే 4 (వార్తాప్రభ) :** కోడూరులో కాపు సంక్షేమ భవన నిర్మాణం ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోడూరు మండల కాపు సంఘ నేతలు కోరారు. సోమవారం కోడూరు మండల కాపు నాడు సంఘ నేతల ఆధ్వర్యంలో మచిలీపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పి.సాయిబాబు కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కోడూరు కే డి డి సి బ్యాంక్ ప్రక్కన స్థలం నందు కాపు సంక్షేమ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడు సంవత్సరాల పూర్తయినప్పటికీ నేటి వరకు నిర్మాణం చేపట్టలేదన్నారు. కాపు సామాజిక వర్గీయులు అధికసంఖ్యలో ఉండుట కారణంగా వివిధ సందర్భాలలో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు సరైన భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కావున కాపు సంక్షేమ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, వెంటనే సంక్షేమ భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపునాడు కోడూరు మండల అధ్యక్షులు నాగం రఘు, కాపు సంఘ నేతలు ఉల్లి శేషగిరిరావు, రేపల్లె యోగ ప్రకాష్, గరికపాటి నాగేశ్వరావు,దామెర్ల నారాయణ, గాదె అనిల్,చుండూరు సారధి తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి కిరణ్ ను హత్యచేసిన రామకృష్ణ ను జనసేన పార్టీ నుండి సస్పెండ్

● హత్యలు దాడులకు పాల్పడే వారికి మా మద్దతు లేదు: చలమలశెట్టి రమేష్ బాబు



**హనుమాన్ జంక్షన్,మే 4 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లో హెచ్ మార్ట్ నిర్వాహకుడు వడ్డి క్రాంతి కిరణ్ ను కారుతో ఢీ కొట్టి హత్య చేసిన రామినేని రామకృష్ణని కఠినంగా శిక్షించాలని జనసేన గన్నవరం నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. హత్యకు గురైన క్రాంతికిరణ్, హత్యచేసిన రామకృష్ణ తనకు సొంత మనుషులేనని, అయినా హత్యకి పాల్పడిన వ్యక్తిని క్షమించకూడదన్నారు. రామకృష్ణ ని అరెస్టు చేసిన పోలీసులు అతనికి సరైన శిక్ష పడేలా చూడాలని కోరారు. అతనిని జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేశామని,సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని అధిష్ఠానానికి లేఖ రాశామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హత్యలు, దాడులకు పాల్పడిన వారికి మద్దతుగా వుండబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు వడ్డి శివ నాగేశ్వరరావు,షేక్ అహ్మద్,వడ్డి అశోక్,మజ్జి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# షుగర్ పేషెంట్లకు ఉదయాన్నే బ్లడ్ శాంపిల్స్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.... జనసేన నాయకులు..



**కృత్తివెన్ను,మే 4 (వార్తాప్రభ) :** లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో షుగర్ పేషెంట్లకు ఏమీ తినకుండా( ఫాస్టింగ్) ఇచ్చే బ్లడ్ శాంపిల్ లను తీసుకునే విధంగా ప్రాథమిక వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఇదే సమస్యపై గతంలో కూడ అధికారులకు విన్నవించుకున్న ప్పటికిని ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని జనసేన నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఉన్నతాధికారులు అత్యాధునిక పరికరాలతో రోగులకు వైద్య సేవలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన క్రియాశీల సభ్యుడు పులగం యుగంధర్ జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు పులగం శ్రీనివాస్ జనసేన కృత్తివెన్ను మండల ప్రధాన కార్యదర్శి మరియు లక్ష్మీపురం పిఎసిఎస్ డైరెక్టర్ కాజా మణికంఠ కార్యదర్శి కొప్పినేటి ఆదిశేషు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు....

# పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక..



**రాజాం,మే 4 (వార్తాప్రభ) :** సారధి బాలికలు ఉన్నత పాఠశాలలో 1992–93లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులంతా రాజాంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో కలుసుకు న్నారు. పరస్పరం యోగక్షేమాలు అడిగితెలుసుకుని, ఆనాటి స్మృతులను నెమరువేసుకున్నారు.. నాటి గురువులు మల్లేశ్వరరావు, శ్రీలక్ష్మి, నాగమణి లను సత్కరించారు. పూర్వ విద్యార్థులు లాభాన శ్రీదేవి, జగన్నా, సత్యశాంతి, శెట్టి శ్రీదేవి, తదితర 35 మంది ప్రతీ ఏడాది ఇలాగే కలుసు కోవాలని, ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మూడు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు కొత్తగా పరిచయం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకుని భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ జీవితం గురించి పరస్పరం అడిగి తెలుసుకున్నా రు.

# ఈ ప్రతిభ పదిలం.. భవిష్యత్తుకు అందలం

● ఇదే స్ఫూర్తితో జీవితంలో ఉన్నతంగా ఎదగాలి ● సత్ఫలితాలిచ్చిన 100 రోజుల కార్యాచరణ వ్యూహం ● 72 శాతం ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత ఓ చారిత్రక ఘట్టం ● జిల్లాను ముందంజలో నిలిపిన ప్రతిఒక్కరికీ అభినందనలు ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ● భవిష్యత్తుకు ప్రేరణగా లంచ్ విత్ కలెక్టర్ కార్యక్రమం





**విజయవాడ,మే 4 (వార్తాప్రభ) :** జిల్లాలో ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాలు గణనీయమైన పురోగతిని నమోదు చేశాయని.. విద్యార్థులు తమ ప్రతిభను, జ్ఞాపకాలను పదిలంగా కాపాడుకుంటూ అదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సంబంధించి 580, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన 31 మంది విద్యార్థులు, మండల టాపర్లు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరించే కార్యక్రమం సోమవారం నగరంలోని పటమట, సాయి జువెల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. అదేవిధంగా భవిష్యత్తుకు ప్రేరణగా నిలిచేందుకు టాపర్స్‌కు లంచ్ విత్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభావంతులైన విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులను పతకాలు, ప్రశంసా పత్రాలు, శాలువాలతో సత్కరించారు. ముందు మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గౌరవ సీఎం, గౌరవ డిప్యూటీ సీఎం, గౌరవ విద్యాశాఖ మంత్రితో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారుల ప్రత్యేక చొరవ ఫలితంగా ఈ ఏడాది పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికా వ్యూహం అద్భుత ఫలితాలు ఇచ్చిందని.. 72 శాతం ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతిరోజూ స్లిప్ టెస్టులు నిర్వహించి బలాలు, బలహీనతలను గుర్తించి విద్యా సముపార్జనలో సమస్యలను తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యాచరణ ప్రణాళిక విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపి మంచి ఫలితాల సాధనకు దోహదం చేసిందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

**ప్రతిభను గుర్తించి.. భవితకు ప్రేరణగా నిలిచి:** వచ్చే ఏడాది పదో తరగతి పరీక్షల్లో మరింత ఉన్నత విజయాలు సొంతం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సత్కార కార్యక్రమంతో పాటు లంచ్ విత్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మహమ్మద్ ఎ.ఫర్హీన్ 595 మార్కులు, కె.నాగదుర్గారాణి 593 మార్కులు, జి.నిత్య సాత్విక 591 మార్కులతో ఇలా ఎందరో విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలిచారని.. జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కృషిచేశారన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ముఖ్యంగా తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ ర్కొన్నారు.

**మార్గదర్శులు చేయందించాలి:** పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన చిన్నారులు వారి కెరీర్ కలలను ఆవిష్కరించారని.. ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించిన ఈ విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు మనసున్న మార్గదర్శులు పీ4 కార్యక్రమం ద్వారా ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ ఆణిముత్యాలకు చేయూతనందించి బంగారు భవిష్యత్తు అందించేందుకు ముందుకొచ్చి, ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడుగా నిలవాలని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు విశేష కృషిచేస్తోందని.. వినూత్న కార్యాచరణతో ముందుకెళ్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవోలు సాంబశివరావు, గుర్నాథం, శ్యాంసుందర్, మార్గదర్శి యు.నిరుపమ బలరాం (సాయి మందిర్ కమిటీ)తో పాటు ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం



**గుంటూరు,మే 4 (వార్తాప్రభ) :** వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ యాదవ్ వారి కోడలు కోనంకి జమున కృష్ణ పుట్టినరోజు సందర్భంగా నాయుడుపేటలోని డంపింగ్ యార్డ్ నందు నివసిస్తున్న నిరుపేదలకు అన్న వితరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ నాయుడుపేటలో నివసిస్తున్న నిరుపేదల దగ్గరికి రెగ్యులర్గా రావడం, వారికి కావలసిన దుస్తులు, బియ్యం, సరుకులు, మంచినీరు అందించడం మరియు అన్న వితరణ కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలలో జీవన శైలిలో మార్పు రావడం, పిల్లలలో కూడా చైతన్యం తో పాటు చదువుకోవడం పట్ల శ్రద్ధ కలగటం చెప్పుకోదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ యాదవ్, కోనంకి రాధాకృష్ణ యాదవ్, లోహిత్, వినయ్ కుమార్, యోగిత, సుశీల మరియు స్థానిక ఫాస్టర్స్ పాల్గొన్నారు.

## 345మందికి ఉచిత వైద్య సేవలు...



**గుడ్లవల్లేరు,మే 4 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో నిర్వహించిన వైద్య శిబిరంలో ఉచిత కార్పోరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 345మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు వైద్యం, కంటి వైద్య పరీక్షలకు గుడ్లవల్లేరు ఎల్వీ ప్రసాద్ హనుమకొండ భవాని వైద్య బందం, విజయవాడ కామినేని వైద్యులచే పరీక్షలు, సాధారణ వైద్యానికి హోమియో వైద్యురాలు పి.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు.

## వైభవోపేతంగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ...




**గుడ్లవల్లేరు,మే 4 (వార్తాప్రభ) :** భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ వైభవోపేతంగాఊంజల సేవను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.

## దాహార్తిని తీర్చటం మహా పుణ్యం...



**గుడ్లవల్లేరు,మే 4 (వార్తాప్రభ) :** వేసవిలో దాహార్తిని తీర్చటం మహా పుణ్య కార్యక్రమని కట్టవాని చెరువు గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీష్ అన్నారు. సోమవారం వేసవిని పురస్కరించుకుని స్థానిక పంచాయితి కార్యాలయం ఎదుట మజ్జిగ పంపిణీ కార్యమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని దాత అబ్దుల్ సోహెల్ అహ్మద్ నిర్వహించారని జగదీష్ తెలిపారు.

## పది టాపర్లకు ఎమ్మెల్సీ అభినందనలు..



**కాకినాడ,మే 4 (వార్తాప్రభ) :** 10వ తరగతి టాపర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారిని సన్మానించడం ద్వారా ఒక ప్రేరణాత్మక కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ చేపట్టారు. విద్యార్థుల కృషి, పట్టుదల, ప్రతిభను గుర్తించి అభినందించడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను కూడా అందజేశారు. వారి ఇళ్లకు వెళ్లడం ద్వారా కుటుంబ సభ్యులతో సాన్నిహిత్యం పెంచుతూ, విజయానికి కుటుంబం ఇచ్చే సహకారాన్ని గుర్తించారు. ఈ కార్యక్రమం విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ, కష్టపడితే విజయం సాధ్యమనే సందేశాన్ని ఇస్తోంది. ఇది ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలుస్తోంది.

# అవోపా రాష్ట్ర అధ్యక్షులుగా ప్రగల్లపాటి కనకరాజు, మహిళా అధ్యక్షురాలుగా డాక్టర్ ప్రగల్లపాటి నాగమణి ప్రమాణస్వీకారం




**కిర్లంపూడి,మే 4 (వార్తాప్రభ) :** అమరావతిలో అవోపా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి మాజీ మంత్రి మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవోపా అధ్యక్షులుగా ప్రగల్లపాటి కనకరాజు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా డాక్టర్ ప్రగల్లపాటి నాగమణి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన ప్రగల్లపాటి కనకరాజు మాట్లాడుతూఆర్యవైశ్య సంఘాలలో ఉత్తమమైన క్రమశిక్షణతో కూడినటువంటి సంస్థ ఒకే ఒక్కటి రాష్ట్ర అవోపా సంస్థయని అటువంటి సంస్థకు అధ్యక్షునిగా తనకు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని, దానిని సంరక్షించుకుంటూ మరింత వన్నె తెచ్చే బాధ్యత తనపై ఉందన్నారు. అహోపా ద్వారా ప్రతి ఏటా ఆర్యవైశ్యులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వటం, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన అన్ని చర్యలు తీసుకునే ఏకైక సంస్థయని కనకరాజు కొనియాడారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులు ఎవరికైనా రక్తం కావలసివస్తే రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఒక ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా ఆర్యవైశ్య యువతకు ఉపాధి కల్పించేందుకు హైదరాబాద్ కు చెందిన బెల్ ఫార్మాసిటికల్స్ అధినేత కె సోమేశ్వరరావుతో అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ఆర్యవైశ్య నూతన వధూవరులకు మంచిసేవలు అందించే విధంగా తమ కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తనకు సహకరించాలని కోరారు. అవోపా రాష్ట్ర అధ్యక్షునిగా తనను ఏకగ్రీవంగా ఎంపిక చేయడానికి సహకరించిన చైర్మన్ టీజీ వెంకటేష్, ఫౌండర్ ప్రెసిడెంట్ పువ్వాడ చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు తట్టవర్తి రాంబాబు, రాష్ట్ర అవోపా సభ్యులకు ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశానికి ఫౌండర్ ప్రెసిడెంట్ అయినటువంటి పువ్వాడ చంద్రశేఖర్ మాట్లాడుతూ మన టీజీ వెంకటేష్ దానవీరశూరకర్ణయని ఆయన చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ ప్రగల్లపాటి నాగమణి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సభ అధ్యక్షులు వెల్లూరి లక్ష్మయ్య, ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు వెలిగొండ సుబ్బరాయుడు, అవోపా మాజీ అధ్యక్షులు తటవర్తి రాంబాబు, రాష్ట్ర మహిళా విభాగ గౌరవ అధ్యక్షురాలు అరవేటి నిర్మల, సిఏ రాధాకృష్ణ,ఇంజనీర్ సంతోష్, వాడపల్లి ఆర్యవైశ్య సత్రం చైర్మన్ కే వెంకటేశ్వరరావు, భరద్వాజ్, చక్రవర్తి మొదలగు ఆర్యవైశ్య ప్రముఖులు నూతన అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన ఆదర్శ దంపతులైనటువంటి ప్రగల్లపాటి కనకరాజు డాక్టర్ నాగమణిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికివిచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కనకరాజు దంపతులు ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రధాని మోదీకి దేశ ప్రజలు సంపూర్ణ మద్దత - లింగం నాగేశ్వరరావు



**కృత్తివెన్ను,మే 4 (వార్తాప్రభ) :** పశ్చిమ బెంగాల్ మరియు అస్సాం రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలవడం పట్ల జనసేన పార్టీ పెడన నియోజకవర్గ సీనియర్ నాయకులు లింగం నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మోడీ తిరుగులేని నాయకత్వం పై దేశ ప్రజలందరూ సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గతంలో ఎన్నో సందర్భాల్లో ప్రశంసించిన సంగతిని ఈ సందర్భంగా లింగం నాగేశ్వరరావు గుర్తు చేశారు. మరోవైపు తమిళనాడు రాష్ట్రానికి జరిగిన ఎన్నికల్లో యాక్టర్ విజయ్ విజయం సాధించడం మాములు విషయం కాదని రానున్న రోజుల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ కూడా ఘన విజయం సాధించి పవన్ కళ్యాణ్ సీఎం కావడం ఖాయమని లింగం నాగేశ్వరరావు విశ్వాసం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో చరిత్ర సృష్టించి తొలి సారి అధికారంలోకి రానున్న బీజేపీ పట్ల,ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారధ్యం పట్ల దేశ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఈ గెలుపు స్పష్టం చేసిందని లింగం నాగేశ్వరరావు పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పం లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో అనేక సంస్కరణలు చేపట్టి, ప్రపంచంలో మన దేశాన్ని అత్యంత శక్తివంతమైన రాజ్యంగా అవతరింపజేశారని లింగం నాగేశ్వరరావు కొనియాడారు. విజ్ఞులైన బెంగాల్ ప్రజలు ప్రధాని నరేంద్ర మోడీ వల్లే తమ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని, అభివృద్ధి పథంలో పయనిస్తోందని నమ్మకం ఉంచడంతో ఈ భారీ విజయం లభించిందని లింగం నాగేశ్వరరావు వివరించి ఇంతటి ఘన విజయం గావించిన నాయకులకు కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## సంబరాలు జరుపుకున్న బిజెపి నేతలు




**నందిగామ,మే 4 (వార్తాప్రభ) :** పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు మునగంటి కామేశ్వరరావు వారి ఆధ్వర్యంలో సోమవారం పలు రాష్ట్రాల్లో బిజెపి విజయకేతనం ఎగురవేసి సత్తా చాటుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని గాంధీ సెంటర్లో మిఠాయిలు పంపిణీ చేసి బాణా సంచాలతో తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. భారతదేశ ప్రజలంతా కూడా అవినీతి లేని పరిపాలన కోరుకుంటున్నారని గత 12 సంవత్సరాల నుంచి ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలన భారతదేశ పేద ప్రజలందరికీ సౌలభ్యం గా ఉన్నదని అందుకే దేశ ప్రజలంతా బిజెపి కి పట్టం కడుతున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి తోర్లికొండ సీతారామయ్య. మార్కెట్ యార్డ్ చైర్మన్ పిట్టల శ్రీదేవి జిల్లా కార్యదర్శి పోరుగంటి నరసింహారావు ఓబీసీ కార్యదర్శి గోనెల సత్యనారాయణ పట్టణ ప్రధాన కార్యదర్శి తులసి కృష్ణ. మాజీ పట్టణ అధ్యక్షులు పులిపాటి లక్ష్మీనారాయణ జిల్లా కిషన్ మాజీ అధ్యక్షులు కొత్త సాంబశివరావు సత్యనారాయణ గుప్తా. జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి గంగుల జయ శ్రీ జిల్లా ఓబీసీ కార్యదర్శి యాగ్రగౌర్ల లక్ష్మణ్ రామాలయ డైరెక్టర్ మీసేవ రామాచారి మాజీ కో కన్వీనర్ నూతక్కి విజయ్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు సీనియర్ నాయకులు బండారు కేదారేశ్వర శర్మ. బాదర్ల ఆంజనేయులు మాస్టారు కొమ్మినేని సత్యనారాయణ రజియా బేగం డాక్టర్ కొత్తపల్లిసత్యనారాయణ కనగాల విష్ణు పింజల కుమారి రమణ వెంకటేశ్వరరావు చల్ల వెంకటేశ్వరరావు. శర్మ. పలువురు బిజెపి అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మేధాశక్తిని పెంపొందించే అందుకే చెస్ పోటీలు

-సంసిద్ స్కూల్లో చెస్ విజేతలకు బహుమతులు



**ముమ్మిడివరం,మే 4 (వార్తాప్రభ) :** ముమ్మిడివరం మండలంలో అనాతవరములోని స్థానిక పాఠశాల అయిన సంసిద్ స్కూలులో సోమవారంన చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంటు సంసిద్ధ పాఠశాల చైర్మన్ వాస శ్రీనివాస్ , డైరెక్టర్ వాసా మాధవి, సీఈవో ఇందు సనో సహాయ సహకారాలతో నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.వీరభద్ర రావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డా. బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ టీ.వి సురేష్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొన్న చెస్ క్రీడావిజేతలుకు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను నగదు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించే ముం దుగా ప్రిన్సిపల్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల మేధో శక్తిని,ఏకాగ్రతను పెంపొందించడానికి టోర్నమెంట్ నిర్వహించినట్లు ఆయన చెప్పారు. తర్వాత పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.ప్రీతి మాట్లాడు తూ చెస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. తదనంతరం విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను పెంపొందిం చేలా మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామని క్లస్టర్ మేనేజర్ ఎం.సురేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యా యులు, బోధనేతర సిబ్బంది,విద్యార్థులు, విద్యార్థినీలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రాణ సంకటంగా మారిన వేలంక రహదారిని నిర్మించండి మహాప్రభో...




**కిర్లంపూడి,మే 4 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామం నుంచి వేలంక గ్రామం వరకూ ఉన్న రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం వాహనదారులకు ప్రాణ సంకటంగా పరిణమించింది. అడుగుకోమడుగు మాదిరిగా ఉన్న ఈ మార్గంలో ప్రయాణించే కార్లు ఆటోలు ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మత్తుల బారిన పడుతున్నాయి. రెండు రోజుల కిందట న్యాయవాది కాళీ ప్రసాద్ కారు ఈ మార్గంలో గుంతలలో పడి మరమ్మత్తులకు గురైంది. అలాగే అనేకమంది వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ రహదారి నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చిన కాలయాపన కారణంగా మరింత ఇబ్బందులు అధికమ య్యాయని ఈ మార్గంలో ప్రయాణించే పలు గ్రామాల ప్రజలు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి చిల్లంగి వేలంక రహదారిని పునర్నిర్మించాలని కోరుతున్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188